# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :184 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 26-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై న్యాయ విచారణ

న్యూఢిల్లీ,అహ్మదాబాద్‌లో జరిగిన 171 విమాన ప్రమాద ఘటనపై న్యాయ విచారణ జరపాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడిని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ఎఫ్ఐపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి ఎఫ్ఐపీ రాసింది. ఈ లేఖను సోమవారం అంటే.. సెప్టెంబర్ 22వ తేదీన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి రాసింది. కానీ ఈ లేఖ బుధవారం బహిర్గతమైంది. అయితే ఈ ప్రమాదంపై ప్రస్తుతం దర్యాప్తు చేస్తున్న ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) వైఖరిపై ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ పెదవి వివరించింది. ఆ క్రమంలో ఏఏఐబీపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఏఏఐబీ దర్యాప్తు.. విమానయాన రంగంలోని పైలట్ల నైతికతపై ప్రతికూల ప్రభావం చూపు అవకాశం ఉందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాదు.. ఈ విచారణలో భాగంగా 171 విమాన ప్రమాదంలో మరణించిన పైలట్ సబర్వాల్ నివాసానికి ఏఏఐబీ అధికారులు ఆగస్ట్ 30వ తేదీన వెళ్లారు. ఆ క్రమంలో కెప్టెన్ సబర్వాల్ తండ్రితో ఏఏఐబీ అధికారులు వ్యవహరించిన తీరుపై ఎఫ్ఐపీ ఆక్షేపించింది.

## అమెరికాకు పెద్ద షాక్, భారతదేశానికి కొత్త స్నేహితుడు లభించాడు..



న్యూఢిల్లీ,అమెరికా నిరంతరం భారతదేశంపై ఒత్తిడి పెంచడానికి ప్రయత్నిస్తోంది. మొదట, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50% టారిఫ్ విధించాలని నిర్ణయించారు.భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోందని అందుకే తాము టారిఫ్ విధించామని ఆయన చెప్పారు.అయినప్పటికీ, భారతదేశం రష్యా నుండి చమురు కొనడం కొనసాగించింది. టారిఫ్ తర్వాత, డొనాల్డ్ ట్రంప్ హెచ్1-బి వీసా గురించి ఒక పెద్ద నిర్ణయం తీసుకున్నారు, ఆయన హెచ్1-బి వీసా రుసుమును భారీగా పెంచారు. ఇప్పుడు ఈ వీసా కోసం ఒక లక్ష డాలర్లు అంటే దాదాపు ?88 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది, దీనివల్ల ఎక్కువగా భారతదేశం ప్రభావితం అవుతుంది. అంతేకాకుండా, ఆయన ఇంతటితో ఆగకుండా త్వరలో ఈ వీసా గురించి అమెరికాలో ఉన్న లాటరీ పద్ధతి కూడా ఆగిపోనుంది. దీనివల్ల ఇప్పుడు ఒక భారతీయుడు ఉద్యోగం కోసం అమెరికాలో ప్రవేశం పొందడం మరింత కష్టం అవుతుంది.అయితే, ఒక మంచి వార్త బయటకు వచ్చింది, అదేమిటంటే డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల తర్వాత, యూరప్‌లో చాలా దేశాలు ముందుకొచ్చాయి, వాటికి భారతదేశంలోని నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. భారతదేశంలోని జర్మనీ రాయబారి అయిన ఫిలిప్ ఎంకర్‌మాన్, ట్రంప్ పరిపాలన ఈ నిర్ణయం తర్వాత ఇప్పుడు భారతీయులు జర్మనీలో అందుబాటులో ఉన్న ఐటీ, సైన్స్ మరియు మేనేజ్‌మెంట్ రంగాలలోని అవకాశాలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.జర్మనీ రాయబారి ఈ విషయంపై తన ట్విట్టర్‌లో ఒక పోస్ట్ చేశారు, అందులో ఆయన ఇలా అన్నారు: "అధిక విద్యావంతులైన మరియు నైపుణ్యం కలిగిన భారతీయ ప్రజలందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను, వారు తమ కెరీర్ కోసం జర్మనీకి రావాలి. జర్మనీలో భారతీయులకు ఐటీ, మేనేజ్‌మెంట్, సైన్స్ వంటి రంగాలలో అపారమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయి." ఇది ఇప్పుడు అమెరికాకు జర్మనీ ఇచ్చిన షాక్‌గా పరిగణించబడుతుంది. ఒకవైపు ట్రంప్ విధించిన రుసుము వల్ల భారతదేశానికి నష్టం జరగడం ఖాయం, అదే సమయంలో భవిష్యత్తులో అమెరికాలో కూడా నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఏర్పడవచ్చు అని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల అమెరికాకు దెబ్బ తగలవచ్చు.

## దేశంలోనే తొలి ఏఐ ఇంటిగ్రేటెడ్కమాండ్ కంట్రోల్ సెంటర్



తిరుమల : టిటిడి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతిరోజూ లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వేలాదిమంది భక్తుల సమస్యలకు చెకె పెట్టేందుకు కృత్రిమమేధస్సు (ఏఐ)ను వినియోగించుకోవాలని చైర్మన్ బిఆర్ నాయుడు కార్యాచరణలోకి తీసుకువచ్చారు. ఎన్ఆర్ఎల దాతృత్వంతో దేశంలోనే తొలిసారిగా తిరుమలలో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాంట్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి)ను టిటిడి అందుబాటులోకి తీసుకువస్తోంది.వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లోని 25వ నంబర్ కంపార్టుమెంట్లో ఈవ్యవస్థను ఏర్పాటుచేశారు. దీనిద్వారా భక్తుల రద్దీ నియంత్రణ, వసతి, భద్రత పెంపొందించడం వంటి చర్యలు చేపట్టనుంది. ఈ కేంద్రాన్ని సిఎం నేడు(గురువారం) ఉదయం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ అందుబాటులోకి వస్తే పెద్ద డిజిటల్ స్క్రీన్, అన్ని విభాగాలకు చెందిన సిసి పుటేజీలు కనిపిస్తాయి.

కొత్తగా అమర్చిన సిసికెమెరాలతో

వీటిని 25 మందికి పైగా సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తూ అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియజేస్తారు. ప్రస్తుతం ఉన్నవాటితోబాటు కొత్తగా అమర్చిన సిసికెమెరాలతో అలిపిరి వద్ద నుండే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుంది. క్యూలైన్లలో ఎంతమంది భక్తులు ఉన్నారు, ఎంత సమయం వారు నిరీక్షిస్తున్నారు, సర్వదర్శనం పరిస్థితి తదితర అంశాలను ఏఐ ట్రాక్చేస్తుంది.ముఖగుర్తింపు పరికరంద్వారా భక్తులను గుర్తిస్తుంది. చోరీలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా కనిపెడుతుంది. తప్పిపోయిన వాళ్ళు ఎక్కడ ఉన్నా గుర్తించి సమాచారం అందిస్తుంది. భక్తుల ముఖకదలికలు(హావభావాలు) ఆధారంగా వారి ఇబ్బందులు తెలుసుకుంటుంది.

కొండపై రద్దీ ఉన్న ప్రాంతాల్ని

క్యూలైన్లు, వసతి ఇతర సౌకర్యాలను వాస్తవ పరిస్థితులలతో 3డి మ్యాపు , చిత్రాలతో చూపుతుంది. కొండపై రద్దీ ఉన్న ప్రాంతాల్ని రెడ్స్పాట్లుగా చూపడంతోబాటు చర్యలకు సంకేతాల్నిస్తుంది. ఆన్లైన్లో నిరంతరం పర్యవేక్షిస్తూ సైబర్దాడులు, టిటిడి ప్రతిష్టను దెబ్బతీసే సామాజిక మాధ్యమాల్లో పెట్టే అనుచిత సమాచారాలను పోస్టులు, ఆన్లైన్లో తప్పుడు సమ అడ్డుకుంటుంది. ఎప్పటికప్పుడు భక్తుల అనుభవాలను తెలుసుకుని శ్రీవారి దర్శనాన్ని మరింత సౌకర్యవంతం చేసేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.అలాగే వైకుంఠం క్యూకాంప్లెక్సు, క్యూలైన్లలో అత్యవసర పరిస్థితుల్లో భక్తులను బయటకు తీసుకువచ్చే సమీప మార్గాలను చూపుతుంది. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ను బుధవారం టిటిడి చైర్మన్ బిఆర్నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డుసభ్యులు శాంతారాం, నరేశ్, సివిఎస్ ఓ కెవి మురళీకృష్ణ, విఎస్ఐ వింగ్ ఎస్టీవిరామ్కుమార్ పరిశీలించారు.

## ఆ ఆరుసీట్లు వదిలేస్తే మద్దతిస్తా.. అసదుద్దీన్ ఒవైసీ ఓపెన్ ఆఫర్..



పాట్నా:బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని తహతహలాడుతున్న మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీకి ఇండి కూటమి నేతల నుంచి వరుస షాక్‌లు తగులుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ ఆరుసీట్లలో గెలిచిందని , ఆ సీట్లను తమకు ఇవ్వాలని ఒవైసీ ఇండి కూటమి నేతలకు విజ్ఞప్తి చేశారు.ఆరుసీట్లు వదిలేస్తే బిహార్‌లో మిగతా సీట్లలో ఇండి కూటమి అభ్యర్థులకు మద్దతిస్తామని ఓపెన్ ఆఫర్ ఇచ్చారు."మాకు ఆరు సీట్లు ఇవ్వాలని లేఖ రాశాం. ఇక వాళ్లే నిర్ణయం తీసుకోవాలి. బీజేపీని ఎవరు గెలిపిస్తారో , ఎవరు అడ్డుకుంటారో బిహార్ ప్రజలే నిర్ణయిస్తారు. చర్చలు జరపలేదని ఎవరు తరువాత మమ్మల్ని విమర్శించరాదు. మేము అన్ని ప్రయత్నాలు చేశాం. జనం ముందు మా ప్రతిపాదనలు పెట్టాం. ఎన్ని సీట్లలో పోటీ చేస్తామో త్వరలో తెలుస్తుంది.."- ఎంఐఎం అసదుద్దీన్ ఒవైసీ

ఒవైసీ ఆఫర్‌కు ఆర్జేడీ నేతల తిరస్కరణ

అయితే ఒవైసీ ఆఫర్‌ను ఆర్జేడీ నేతలు తిరస్కరించారు. ఒవైసీని తాము నమ్మడం లేదని, మజ్లిస్ పార్టీ బీజేపీకి బీటీమ్‌గా పనిచేస్తోందని వాళ్లు విమర్శలు కురిపిస్తున్నారు. మజ్లిస్ హైదరాబాద్‌లోనే పోటీ చేస్తే బాగుంటుందని, ఆర్జేడీ హైదరాబాద్‌లో పోటీ చేయడం లేదన్న విషయాన్ని ఒవైసీ గుర్తించాలంటున్నారు. ఒవైసీకి దమ్ముంటే బిహార్‌లోని అన్ని సీట్లలో పోటీ చేయాలని సవాల్ విసిరారు.ఆర్జేడీ నేతల తీరుపై ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సత్తా ఏంటో ఎన్నికల తరువాత తెలుస్తుందన్నారు. మజ్లిస్ పార్టీ ఎవరికి బీటీమ్‌గా పనిచేయడం లేదని స్పష్టం చేశారు. త్వరలో అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు ఒవైసీ..ముస్లింలు ఎక్కువగా ఉన్న సీమాంచల్ ప్రాంతంపై గురిపెట్టారు ఒవైసీ. సీమాంచల్‌లో ఒవైసీ సభలకు జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ ఆరుసీట్లలో విజయం సాధించడంతో పాటు ఓట్ల శాతాన్ని పెంచుకుంది. సీమాంచల్‌లో ఒవైసీ ఒంటరిగా బరి లోకి దిగితే ఇండి కూటమి అభ్యర్థులకు చాలా నష్టం జరుగుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఎందుకు కాలేదో చెప్పిన కేటీఆర్



హైదరాబాద్,2023 చివర్లో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమి నుంచి బీఆర్ఎస్ ఇంకా బయటకు రాలేకపోతోంది? ఇప్పటికి తమ ఓటమికి కారణాల్ని వెతుకుతోంది. ఇందుకు తాజాగా ఆ పార్టీ కీలక నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. ఇప్పటికి పార్టీ ఓటమికి కారణం పార్టీ అధినేత కేసీఆర్ కానే కాదని.. ఆ తప్పు ఎలా జరిగిందో తెలుసా? అంటూ కొత్త కోణాల్ని ఆవిష్కరిస్తున్న వైనం చూస్తే.. ఇప్పుడు ఇది అవసరమా? అనిపించకమానదు.జరిగింది వదిలేసి.. జరగబోయే దాని మీద ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. నిజానికి ఓటమి ఎదురైన ఆర్నెల్ల వరకు ఇలాంటివి చెప్పేందుకు.. వినేందుకు బాగుంటాయి. ఓటమి ఎదురై మరో రెండు నెలలకు రెండేళ్లు పూర్తి కావొస్తున్న వేళలోనూ.. ఇంకా అప్పటి ఓటమి దగ్గరే కేటీఆర్ ఆగినట్లుగా కనిపిస్తోంది. హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ కాకపోవటానికి కారణం ఏమిటో తెలుసా? అంటూ కేటీఆర్ నోటి నుంచి తాజాగా వచ్చిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇంతకూ ఆయన ఎమన్నారంటే..?"ఎన్నికల వేళలో తెలంగాణ ప్రజలంతా స్థానికంగా ఉన్న తమ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడినా ఫర్లేదు.. కేసీఆర్ మాత్రం ముఖ్యమంత్రి అవుతారని భావించారు.అందరూ అలా అనుకోవటం వల్లే కేసీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ నేతలు ఆగమాగం చేశారు" అని మండిపడ్డారు. ఒకవేళ కేటీఆర్ చేసిన వాదనే సరైందని భావిద్దాం. ప్రజల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను గుర్తించటంలో ఫెయిల్ అయ్యింది ఎవరు? తమ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల్ని మార్చి ఉంటే.. ఈ ఓటమి ఎదురయ్యేది కాదు కదా? అలా చూసినా.. కేసీఆర్ అంచనాలు తప్పటంలోనే ఆయన ముఖ్యమంత్రి కాలేకపోయారు కదా?అలాంటప్పుడు ఓటమి నిందను వాళ్ల మీదా.. వీళ్ల మీదా వేసే బదులుగా ఆ విషయాన్ని వదిలేసి.. ప్రజా సమస్యల మీద ఫోకస్ ఎక్కువగా పెడితే బాగుంటుంది కదా? అన్నది ప్రశ్న. ఇప్పటికి తమలోని లోపాల్ని అంగీకరించే బదులుగా.. ఎదుటోళ్లను బద్నాం చేసే ధోరణి నుంచి కేటీఆర్ బయటకు రానంత వరకు ఆ పార్టీకి మేలు జరగదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.దేవుని పేరు చెప్పి ఓట్లు వేసుకోవటం ఒక్కటే బీజేపీకి తెలుసన్న కేటీఆర్.. కాంగ్రెస్ దొంగ మాటలు హైదరాబాద్ ప్రజలు నమ్మలేదని.. కానీ ఊళ్లలో నమ్మి మోసపోయారని కేటీఆర్ వ్యాఖ్యానించటం గమనార్హం. ఒకవేళ ఆ మాటే నిజమని భావిస్తే.. హైదరాబాద్ మహానగర పరిధిలో గెలిచిన కంటోన్మెంట్ స్థానం.. సదరు ఎమ్మెల్యే రోడ్డు ప్రమాదంలో మరణించిన వేళ.. సార్వత్రిక ఎన్నిక వేళలో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎందుకు ఓడింది? కాంగ్రెస్ అభ్యర్థి ఎందుకు గెలిచినట్లు? అన్నవి ప్రశ్నలు.అంటే.. తమను గెలిపించిన కంటోన్మెంట్ ప్రజలు.. ఆర్నెల్లకే కాంగ్రెస్ దొంగ మాటలకు పడిపోయి.. ఓటేసినట్లా? మరి..ఇలాంటి ప్రశ్నలకు కేటీఆర్ ఎలాంటి సమాధానం ఇస్తారు? తమ ఓటమికి తాము ఎంత మాత్రం కారణం కాదన్నట్లుగా.. అయితే ప్రజలు మోసపోయారు, లేదంటే.. పార్టీలుమోసం చేశాయన్న మాటలు కేటీఆర్ ఇంకెంత కాలం చెబుతారు? అన్నది ప్రశ్న. అందుకే అనేది.. ప్రత్యర్థులపై నిందలు వేయటం మానేసి.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుల్ని ఎత్తి చూపే అంశం మీద మరింత ఫోకస్ చేస్తే బాగుంటుందని చెప్పక తప్పదు. మరి..ఇలాంటి అంశాల మీద కేటీఆర్ ఫోకస్ పెట్టేదెప్పుడు? అన్నదే అసలు ప్రశ్న.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మనందరికీ స్ఫూర్తిదాయకం..



న్యూఢిల్లీ,పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం పలువురు ప్రముఖులు, కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ఆయనకు నివాళులర్పించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, ఇతర నాయకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం పలువురు ప్రముఖులు, కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు ఆయనకు నివాళులర్పించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, ఇతర నాయకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. "భారతీయ ఆలోచనలకు ప్రముఖ స్తంభం అయిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నేడు. ఆయన మనందరికీ స్ఫూర్తిదాయకం భారతదేశ విద్య, అభివృద్ధి గురించి ఆయన విస్తృతంగా మాట్లాడారు%౩% ప్రధానమంత్రి మోదీ తన ఆలోచనల ఆధారంగా సంక్షేమ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.. దశాబ్దాల క్రితం ఆయన మాట్లాడిన అదే భారతీయ తత్వశాస్త్రం, ఆయన ఆలోచనలపై మేము పని చేస్తున్నాము" అంటూ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.నాలాంటి లక్షలాది మంది కార్మికులకు మార్గదర్శి అయిన గౌరవనీయులైన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాను. సమగ్ర మానవతావాదం అంత్యోదయ వంటి ప్రగతిశీల ఆలోచనల ద్వారా భారత రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేయడంలో గౌరవనీయులైన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విశేష కృషి చేశారు. అభివృద్ధి సంక్షేమం సమాజంలోని చివరి వ్యక్తికి చేరినప్పుడే నిజమైన సామాజిక అభ్యున్నతి సాధ్యమని ఆయన విశ్వసించారు. భారత రాజకీయాలు, సమాజానికి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన కృషి మరువలేనిది.. ఆయన దార్శనికత ఎల్లప్పుడూ బలమైన, సంపన్నమైన, స్వావలంబన గల భారతదేశాన్ని నిర్మించడానికి మనకు స్ఫూర్తినిస్తుంది.. అంటూ.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా కరెక్ట్ చేస్తే కాంగ్రెస్‌కు ముప్పే !



న్యూఢిల్లీ,వృద్ధ కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు నిత్యనూతనంగా ఎలా ఉంటాయని.. అలా ఉంటే ఆశ్చర్య పోవాల్సిందేనని పదే పదే నిరూపిస్తూ ఉంటారు. బీహార్ ఎన్నికల కోసం అక్కడ ఆ పార్టీ అత్యున్నత సమావేశం నిర్వహించింది. అందులో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేస్తే..ప్రజాస్వామ్యానికే ముప్పుఅని చెప్పుకొచ్చారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయని వారే చెబుతారు.. పక్కాగా సవరించేందుకు ప్రయత్నిస్తామంటే.. అది ముప్పు అంటున్నారు. అసలు కాంగ్రెస్ కే క్లారిటీ లేకపోతే.. ఎవరికి ముప్పు వస్తుంది ?

ఓటర్ల జాబితాలోని లోపాలను.. ఓట్ల చోరీగా కాంగ్రెస్ ఉద్యమం

రాహుల్ గాంధీ ఇప్పటివరకూ రెండు ప్రెస్మీట్లు పెట్టి.. ఓట్ల చోరీపై ఆరోపణలు చేశారు. ఆయన ప్రకటించిన వాటికి.. బయట పెట్టిన ఆధారాలకు పెద్దగా స్పందన రాలేదు. ఎందుకంటే అవన్నీ ఓటర్ల జాబితాలో అవకతవకలు. అవి ఎలా జరుగుతాయో అందరికీ క్లారిటీ ఉంది. పై స్థాయిలో జోక్యం చేసుకుని ఓట్లను తొలగించడం అనేది ఉండదు. అందుకే కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఓటర్ల జాబితా రిలీజ్ అయినప్పుడు మనం ఎందుకు పట్టించుకోలేదని రాహుల్ వంటి వారిని అడిగారు కూడా. అలాంటి వారి పదవుల్ని ఊడగొట్టారు కానీ.. అసలు విషయం తెలుసుకునేందుకు ప్రయత్నించలేదు.

బీహార్ ఓట్ల జాబితా సవరణ లోపాలను ఎందుకు బయట పెట్టలేదు?

బీహార్‌లో ఓట్ల సవరణ జాబితాను ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశించినట్లుగా తొలగించిన ప్రతి ఓటు వివరాలు.. ఎందుకు తొలగించారో ఆ కారణం సహా మొత్తం ప్రచురించారు. ఓట్ల చోరీని అక్కడ నిరూపించాల్సి ఉంది. తప్పుడు పద్దతిలో ఓట్లు తీసేసి ఉంటే బయట పెట్టి ఉంటే.. కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమంలో నిజాయితీ ఉందని అనుకుంటారు. కానీ అక్కడ ఆ ప్రక్రియలో ఏమీ బయట పెట్టకుండా.. ఇప్పుడు దేశమంతా చేస్తే.. ముప్పేనని సీడబ్ల్యూసీ లాంటి సమావేశాల్లో చర్చించుకోవడం జాతీయ వృద్ధ పార్టీ ఆలోచనలు.. అంతే వృద్ధ స్థాయిలో ఉన్నాయని అనుకోవాల్సిన పరిస్థితికి కారణం అవుతున్నాయి.

ప్రజాస్వామ్యంపై నమ్మకం తగ్గించలేరు !

ప్రజాస్వామ్యంపై నమ్మకం తగ్గించి.. జెన్ యువత తిరుగుబాటు చేస్తే..తాము పగ్గాలు చేపట్టాలని రాహుల్ గాంధీ ఆశపడుతున్నారు. అందుకే ఆయన ఎన్నికల వ్యవస్థపై దాడి చేస్తున్నారు . పోల్ బాడీని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. ఆయన కుట్రకు కాంగ్రెస్ నేతలు వంత పాడుతున్నారు. కానీ ప్రజల్లో మాత్రం.. ప్రజాస్వామ్యం.. ఎన్నికలు జరిగే ప్రక్రియపై నమ్మకం పెరుగుతోంది. రాహుల్ గాంధీ చేస్తున్న విచిత్ర ఆరోపణలు కూడా నమ్మకం పెరగడానికి కారణం అవుతున్నాయి. దేశమంతా ఓటర్ల జాబితాలను సంస్కరిస్తే కాంగ్రెస్‌కే ముప్పు ఏర్పడవచ్చు. అందుకే వారు కంగారు పడుతున్నారని జనం అనుకునే పరిస్థితి వచ్చింది.

## ఇంధన ఎనర్జీ రంగంలో అద్భుతమైన అవకాశాలు




హైదరాబాద్: దేశంలో గతం కంటే ప్రస్తుతం ఇంధన రంగంలో సరికొత్త ఆవిష్కరణలతో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిఅన్నారు. ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ఎనర్జీ లీడర్‌షిప్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. బొగ్గు, గనులు, పునరుత్పాదక శక్తి వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యల ఫలితంగా ప్రస్తుతం భారత్ అంతర్జాతీయ ఇంధన రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని, దీంతో మన ఇంధన అవసరాలు భారీగా పెరుగుతాయని ఆయన చెప్పారు.

పునరుత్పాదక శక్తి, బొగ్గు వినియోగం

2070 నాటికి నెట్ జీరో ఉద్గారాల లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీనేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని కిషన్ రెడ్డి అన్నారు. పునరుత్పాదక శక్తి సామర్థ్యంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో, సౌర విద్యుత్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. 2014 నుంచి పునరుత్పాదక శక్తి ఉత్పత్తి మూడు రెట్లు పెరిగిందని, దేశ విద్యుత్ అవసరాల్లో సగం శిలాజేతర ఇంధనాల నుంచే ఉత్పత్తి అవుతోందని చెప్పారు. అయితే, భవిష్యత్తులో కూడా బొగ్గు కీలక పాత్ర పోషిస్తుందని, గతేడాది రికార్డు స్థాయిలో 1 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. 2030 నాటికి బొగ్గు డిమాండ్ 1.6 బిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా వేశారు.

సంపాదకీయం

శుక్రవారం 26-09-2025

# యువశక్తి జిందాబాద్...

కాలేజీల్లో చదివే విద్యార్థులు ఏం చేస్తారు? అదేం ప్రశ్న.. చదువుకుంటారు, భవిష్యత్తుకు సంబంధించిన కెరీర్ ప్రణాళికలు వేసుకుంటారు. ఇళ్లలో తల్లిదండ్రులకు సాయం చేస్తారు. అందరికీ తెలిసింది అంతవరకే కానీ వాళ్లు ఇంకా చాలా చేస్తారు. కేరళలో వరద బాధితులకు 150 ఇళ్లు కట్టిచ్చారు. ప్రభుత్వాసుపత్రుల్లో పడకలనుంచి అంబులెన్సుల వరకూ పరికరాలన్నింటినీ మరమ్మతు చేశారు. భవనాలకు రంగులు వేశారు. పశ్చిమ బెంగాల్‌లో తుపాను బాధిత మారుమూల గ్రామాల్లో వరద సహాయక చర్యలు చేపట్టారు. ఇలా చెప్పుకొంటూపోతే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ విద్యార్థులు చేసిన మంచి పనులెన్నో ఉన్నాయి. ఇళ్లు కట్టడం లాంటి పెద్ద పెద్ద పనులు పిల్లలెలా చేయగలిగారని ఆశ్చర్యపోతున్నారు కదూ! సంఘటిత యువశక్తికి ఉన్న బలం అది. ఉన్నత విద్య అభ్యసించే యువతీ యువకులను జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలనేవారు గాంధీజీ. తరచూ ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వారిపైనున్న సామాజిక బాధ్యతను గుర్తుచేసేవారు. కేవలం పుస్తకజ్ఞానం సరిపోదనీ సమాజంతో మమేకమైతేనే విద్యార్థులకూ సమాజానికీ లాభం చేకూరుతుందని నమ్మేవారాయన. ఆయన సిద్ధాంతాల స్ఫూర్తితో ఏర్పడిందే జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్-ఎన్ఎస్ఎస్). గాంధీజీ శతజయంతి సంవత్సరమైన 1969లో సెప్టెంబరు 24న దీన్ని ప్రారంభించారు. యువజన, క్రీడా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పథకంలో యూనివర్సిటీ విద్యార్థులెవరైనా చేరవచ్చు. ప్రతిఫలాన్ని ఆశించకుండా సమాజం కోసం తమ సేవలను వినియోగిస్తారు కాబట్టి వీరిని స్వచ్ఛంద కార్యకర్తలు(వాలంటీర్లు) అంటారు. 'మా కోసం కాదు, మీకోసమే' (నాట్ మి బట్ యు) అన్నది ఎన్ఎస్ఎస్ నినాదం. కోణార్క్ సూర్యదేవాలయానికి చెందిన రథచక్రాన్ని ఎన్ఎస్ఎస్ లోగోగా పెట్టడంలో ఉద్దేశం- వాలంటీర్లు నిరంతరం సమాజ సేవకు సిద్ధంగా ఉండాలనీ, జాతి నిర్మాణానికి యువశక్తి అవిశ్రాంతంగా కృషి చేయాలనీ. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలను యూనిట్లవారీగా చేర్చుకుంటారు. ఒక్కో యూనిట్‌లో వందమంది విద్యార్థులు ఉంటారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నలభైవేలకు పైగా ఉన్న యూనిట్లలో లక్షలాది విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు రకరకాలుగా తమ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ముందస్తు ప్రణాళికతో కొన్ని కార్యక్రమాలు చేపడితేబీ ప్రకృతి విపత్తుల్లాంటివి సంభవించినప్పుడు సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టడానికి అప్పటికప్పుడు రంగంలోకి దిగుతారు. అలాంటివి ఏవీ లేనప్పుడు గ్రామాలను దత్తత తీసుకుని అక్కడి సమస్యలను గుర్తించి పరిష్కారానికి సూచనలిస్తారు. పారిశుద్ధ్యం, పోషకాహారం, వ్యవసాయం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం లాంటివి చేస్తారు. రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎన్ఎస్ఎస్‌లో చేరడం వల్ల విద్యార్థుల్లో సమాజం పట్ల అవగాహన పెరగడమే కాదు, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సామాజిక సమస్యలపై సత్వరం స్పందిస్తారు. సమస్యలను భిన్న కోణాల్లో విశ్లేషించి పరిష్కరించడం ఎలాగో తెలుస్తుంది. ఎలాంటి తారతమ్యాలూ లేకుండా బృందంగా కలిసి పనిచేయడం అలవడుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా శ్రమశక్తి విలువ తెలుసుకుంటారు.

# పార్టీ మారడమే నేటి రాజకీయం



హైదరాబాద్,స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాతి కాలంలో న్యాయవాదులు, ఆస్తిపరులు, భూస్వాములు మాత్రమే ఎక్కువగా రాజకీయ పార్టీల్లో చేరేవారు. వారిలో సేవాభావం కొందరిదైతే, పెత్తనం చెలాయించాలని ఆశ ఇంకొందరిది. మిగతా అల్పాదాయ, దిగువ సామాజిక వర్గాలు పనులు చేసుకునే బతికేవి. ఎన్నికల వేళ ఓటు వేయడం తప్ప వారికి నాయకులతో పెద్దగా పనిపడేది కాదు. ఆ రోజుల్లో దేశంలో కాంగ్రెస్ ఒక్కటే అతిపెద్ద పార్టీ. ఎమర్జెన్సీ తర్వాత దానిపై ప్రజలకు విశ్వాసం సడలింది. ఆ తర్వాత దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి.'రాజకీయం మూరు?డి చివరి స్థావరం' అనే నానుడి ఒకటుంది. జాతీయవాదం అనే చోట రాజకీయం అనే పదం వాడి ఈ మాట అర్థాన్ని వ్యంగ్యంగా మార్చారనే వాదన కూడా ఉంది. నిజమేదైనా మారుతున్న నేటి రాజకీయ పరిస్థితుల లెక్కన ఈ రెండు పదాలకు ఆ వ్యాఖ్యానం సరిపోతుందనుకోవాలి. ఈ రోజుల్లో రాజకీయం అనేది సేవా ప్రవృత్తి నుండి పూర్తికాలపు వృత్తిగా మారిపోయింది. సేవకు నియమాలు, పట్టింపులు గాని వృత్తి, వ్యాపారాలకు ఎదుగుదలే లక్ష్యం. అందుకే రాజకీయాల్లో కొనసాగుతున్నవారు ఎవరైనా ఉన్న పార్టీని వదిలేసి కొత్త పార్టీలో చేరితే తప్పుగా పరిగణించలేము. ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలో చేరడం తప్ప మిగతా అన్ని సందర్భాల్లో వారు మార్పిడిలో స్వతంత్రులే. సమయ స్ఫూర్తితో పార్టీ మారి నష్టపోయినవారికన్నా లాభపడ్డవారే ఎక్కువ. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాతి కాలంలో న్యాయవాదులు, ఆస్తిపరులు, భూస్వాములు మాత్రమే ఎక్కువగా రాజకీయ పార్టీల్లో చేరేవారు. వారిలో సేవాభావం కొందరిదైతే, పెత్తనం చెలాయించాలని ఆశ ఇంకొందరిది. మిగతా అల్పాదాయ, దిగువ సామాజిక వర్గాలు పనులు చేసుకునే బతికేవి.ఎన్నికల వేళ ఓటు వేయడం తప్ప వారికి నాయకులతో పెద్దగా పనిపడేది కాదు. ఆ రోజుల్లో దేశంలో కాంగ్రెస్ ఒక్కటే అతిపెద్ద పార్టీ. ఎమర్జెన్సీ తర్వాత దానిపై ప్రజలకు విశ్వాసం సడలింది. ఆ తర్వాత దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి.వాటి ఉనికిని, అవసరాన్ని స్థానిక ప్రజలు గ్రహించి, కావాలనుకున్నప్పుడు ఆ పార్టీలకు పట్టం కడుతున్నారు. ఈ రకంగా రాజకీయాలు చేసేవారికి మైదానం పెరిగిపోయింది. ప్రాంతీయ పార్టీల ప్రోత్సాహంతో దాదాపుగా అన్ని వర్గాలవారు రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీలోనో, ప్రజల్లోనో ఏదో ఓ పదవి వరించినా ఏ లీడర్ సింగిల్‌గా ఎటూ కదలడు. మా నాయకుడు వేంచేసాడహో అని సందడి చేసే అనుచరగణం వెంటుంటేనే ఆయనకు విలువ. అలా శిష్యరికం చేసినవారిలోంచి కొందరు నేతలుగా ఎదిగిపోయారు. అలా చేరే వారి సంఖ్య పెరిగి రాజకీయం వృత్తిగా మారిపోయింది. ఇక పార్టీ మారే అవసరాలు ఎందుకంటే ఒకే పార్టీలో ఎంతకాలమున్నా కోరుకున్న స్థానం అందరికీ దక్కదు. పార్టీలోని సీనియర్లు ఆ అవకాశాన్ని రాకుండా అడ్డుకుంటారు. ఒక చోట దొరకని ఎదుగుదల మరో పార్టీలో లభిస్తే వదులుకోకూడదు.ఇన్నాళ్లు నమ్ముకున్న పార్టీ, రాజకీయ ప్రవేశానికి అవకాశమిచ్చిన పార్టీ, కష్టకాలంలో ఉన్న పార్టీ అనే భావన రాజకీయ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టుతో సమానమే. పార్టీకి తన వల్ల ఎంత లాభమో, తనకు కూడా ఆ పార్టీ వల్ల అంతే లేదా అంతకన్నా ఎక్కువ లాభం ఉన్నప్పుడే సదరు పార్టీలో కొనసాగాలి. కొత్తగా ఏర్పడే పార్టీలకు ప్రజాదరణ ఉండే అవకాశాలుంటే ముందుగానే చేరితే వ్యక్తిగత గౌరవం, ప్రయోజనం ఎక్కువ. అలాంటి ప్రాప్తకాలజ్ఞులకు ఈ రంగంలో విజయాలు ఎక్కువ. సరియైన సమయంలో పార్టీ మార్పిడి ఎంత లాభమో, మారకుంటే వచ్చే నష్టం కూడా అదే స్థాయిలో ఉంటుంది. తెలంగాణ ఏర్పడి భారాస పాలనలోకి వచ్చాక టిడిపి, కాంగ్రెస్ నుండి చాలా మంది భారాసలోకి మారిపోయారు. టిడిపి వాళ్లకయితే అది అనివార్యం. కాంగ్రెస్ నుండి భారాసలోకి మారి లాభపడ్డవారు కొందరైతే, మారక నష్టపోయినవారు కూడా ఉన్నారు. లాభించినవారి విషయంలో ఖద్దరు బట్టల కాంగ్రెస్ సీనియర్ నాయకుడిని ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆయన తెలివిగా 2013లోనే భారాసలో చేరి ఎన్నికల్లో పోటీ, డబ్బు ఖర్చు అవసరం లేకుండా ఉన్నన్నాళ్లు పార్టీలో ప్రత్యేక హోదా, రాజ్యసభలో సభ్యత్వం పొంది భోగాలు అనుభవించారని చెప్పవచ్చు. విదేశంలోంచి కూతురును రప్పించి ఉన్నత పదవిలో కూచోబెట్టారు.మళ్లీ 2014లో కాంగ్రెస్ లోకి మారి, చేరిన మూడు రోజులకే కేబినెట్ ర్యాంక్ గల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. 86 ఏళ్ల వయసులోనూ పాలక పక్ష రాజకీయాల్లో చీకూ చింతా లేకుండా గడపడం ఆయన పార్టీ మారడం వల్లే సంభవించింది. ఆయన వివాద రహిత స్వభావం వల్ల ఈ మార్పులను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఉత్తర తెలంగాణకు చెందిన ఓ రెడ్డి సామాజిక వర్గ కాంగ్రెస్ సీనియర్ నేత 1989 నుండి ఒకే పార్టీలో ఉంటున్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా, రెండు మార్లు మాత్రమే, కేవలం మూడేళ్లు మంత్రిగా ఉన్నారు. పార్టీనుంచి ఆయన పొందిన దాని కన్నా పార్టీకి చేసినా మేలే ఎక్కువ. తమ ప్రాంతంలో టిడిపి, బిఆర్ఎస్ పార్టీలకు ఎదురొడ్డి నిలిచినా ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఆయనకు దక్కినదేమీ లేదు. పైగా ఆయనపై గెలిచిన భారాస ఎంఎల్ఎకు పార్టీ కండువా కప్పి కొత్త చిక్కులు తెచ్చిపెడుతున్నారు. పార్టీపై అభిమానం చంపుకొని పాలక పక్షాల్లోకి దూకితే పదవీ సౌఖ్యం దొరికేది, ఏడు పదుల వయసులో ఈ మానసిక క్షోభ తప్పేది. రాజకీయం అంటే తెలివైన మోసం అని దాని అర్థమే మారిపోయినపుడు రాజకీయం చేయడమే ఆ వృత్తి లక్షణం.

### బిసి రిజర్వేషన్లపై దాగుడుమూతలు

హైదరాబాద్, బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి ఢిల్లీ పెద్దలను సీఎం రేవంత్‌రెడ్డి ఏనాడూ అడగలేదని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు మొదట చట్ట సవరణ అన్నారని.. తర్వాత ఆర్డినెన్స్.. ఇప్పుడు జీవో అంటున్నారన్నారు. బిల్లుల పేరుతో బీసీలను అవమానిస్తే ఊరుకునేది లేదని చెప్పారు. 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు అడగకపోయినా.. కాంగ్రెస్ పార్టీయే హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల అమలుపై ఆ పార్టీ మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఈ అంశం విద్య, ఉద్యోగాల్లో లక్షల మంది జీవితాలతో ముడిపడి ఉంది. జీవో ఇచ్చి కేవలం రాజకీయ పదవులకే సరిపెడితే ఊరుకునేది లేదు. రాజకీయ పదవుల్లోనూ బీసీలకు పూర్తి న్యాయం చేయలేదు. బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో ధర్నాలు చేశారు.

# మాటలతో కాదు.. చేతలతోనే మేకిన్ ఇండియా సాకారం

న్యూఢిల్లీ,మాటే మంత్రం అన్నది మనం వినేవుంటాం. నేడు అది మనం చూస్తున్నాం. రాజకీయాలలో రాణించాలంటే నాయకత్వ లక్షణాలతోపాటు మంచి వాక్ చాతుర్యం ఉండాలి. ఏ నినాదం ఏ సమయంలో, ఏ మాట ఏ సందర్భంలో ప్రయోగించాలనే టైమింగ్ తెలిసివుంటే అలాంటి నేతకు ఇక తిరుగే ఉండదు. ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ జాతినుద్దేశించి చేస్తున్న ప్రసంగాలు మన మీడియాలో పతాక శీర్షికల్లో వస్తుంటే వాటి చుట్టే చర్చ కూడా సాగుతోంది. దేశం ఎదుర్కొంటున్న పలు సవాళ్ల నేపథ్యంలో మోడీ నోట వచ్చిన మాటలు చర్చకు కేంద్ర బిందువుగా మారాయి. ప్రధాని నరేంద్ర మోడీని దోస్త్ మేరా దోస్త్ అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశ ఎగుమతులపై భారీసుంకాలు వేస్తూ వెళ్తున్నారు. తన మిత్రుడు ట్రంప్‌ను ప్రధాని మోడీ కట్టడి చేయలేకపోతున్నారు అన్న విమర్శలు విపక్షాలు చేస్తున్న సందర్భంలో ప్రధాని మేక్ ఇన్ ఇండియా నినాదం ఎత్తుకొన్నారు. విదేశీ వస్తువుల వాడకం తగ్గించి స్వదేశీ వస్తువుల వాడకం పెంచుకోవాలి, అందుకోసం మేడిన్ ఇండియా నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన మేక్ ఇన్ ఇండియా పిలుపును నిజంగా స్వాగతించాల్సిందే.కానీ మేక్ ఇన్ ఇండియాను సాకారం చేసుకోవాలంటే దేశం ఓ విజన్‌తో ముందుకెళ్లాలి. ప్రధాని నరేంద్ర మోడీ మేకిన్ ఇండియా నినాదం ఈనాటిది కాదు. కాకపోతే అమెరికా సుంకాల భారీ పెంపు నేపథ్యంలో మరోసారి మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని నరేంద్ర మోడీ తెరపైకి తెచ్చారు. బిజెపి చాలాకాలంగా స్వదేశీ నినాదం అందుకుంటూ అది ఒక ప్రచారంగా చేస్తూ వస్తోంది.స్వదేశీ వస్తువుల తయారీ విధానమే మేక్ ఇన్ ఇండియా. వాస్తవానికి ఈ నినాదం ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన నాటినుంచే ఎత్తుకొన్నారు. నినాదం ఆచరణలో సార్థకం కావాలంటే వాటి అమలుకు ఓ విజన్‌తో ముందుకు సాగాలి. వాస్తవానికి దేశప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టి 11ఏళ్లు కావస్తోంది. అంటే పదకొండేళ్ల కిందటే మేక్ ఇన్ ఇండియా విజన్‌తో ఫుల్ ఫోకస్‌గా పనిచేసి వుంటే స్వదేశీ వస్తువుల తయారీ పెరిగి నినాద ఫలాలు నేడు కనిపించేవి. కానీ అందుకు విరుద్ధంగా నేడు పరిస్థితి నెలకొంది. 'మేక్ ఇన్ ఇండియా' అంటూ మోడీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన కార్యక్రమం దేశీయ తయారీ రంగం లో ఏమాత్రం ఉత్సాహాన్ని నింపలేకపోయింది. 11 ఏండ్లపాటు ప్రచారం చేసినా ఫలితం శూన్యం. మోడీ హయాం కంటే జిడిపిలో తయారీ రంగం వాటా అంతకుముందే బాగుండటం గమనించదగ్గ విషయం. 2014 మే నుంచి కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా ఉంటున్న విషయం తెలిసిందే. 2030 నాటికి దేశ జిడిపిలో తయారీ రంగం వాటాను 25 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని తీసుకొచ్చారు.అయితే గత ఆర్థిక సంవత్సరం 2023- 24లో ఇది 15.9 శాతంగానే ఉన్నది. కానీ 2013 - 14లో అంటే కాంగ్రెస్ హయాంలో 16.7 శాతంగా ఉండటం విశేషం. తాజాగా జిడిపిలో స్వదేశీ ఉత్పత్తి 12.6 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ పాలనలోకంటే మేకిన్ ఇండియా నినాదం ఎత్తుకొన్న మోడీ హయాంలోనే స్వదేశీ వస్తూత్పత్తి రంగం దిగజారిందన్నది. ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. మంత్రాలకు చింతకాయలు రాలవు అన్నది ఎంతటి వాస్తవమో అమెరికా భారీ సుంకాల నేపథ్యంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు మేక్ ఇన్ ఇండియా నినాదంతో ఇప్పటికపుడు సమస్యలు పరిష్కారం కావు. మేక్ ఇన్ ఇండియా నినాదం అమలు చేసే దిశగా ఓ పక్కా కార్యాచరణ మోడీ సర్కార్ కు ఉండాలి. పదకొండేళ్ల




కిందటే మోడీ ఈ నినాదం ఎత్తుకొన్న వాటి ఫలాలు మాత్రం కనిపించలేదు అంటే ప్రణాళిక అమలులోనే లోపం ఉందన్నది స్పష్టమవుతోంది. మోడీ అధికారంలోకి వచ్చాక దేశప్రగతిపై కంటే ఎక్కువగా మత పరమైన అంశాల చుట్టే రాజకీయాలు సాగుతున్నాయి. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఎన్నికల సమయంలో మతపరమైన అంశాలపైనే ఫోకస్ చేశారు. అభివృద్ధి చుట్టూ రాజకీయాలు సాగే చోట మతపర అంశాలకు ఆస్కారముండదు.మత రాజకీయాలు సాగే చోట అభివృద్ధికి ఆస్కారముండదు. ప్రపంచ చరిత్ర ఇదే తెలియజేస్తోంది. మేక్ ఇన్ ఇండియా అనే మోడీ పాలనలో విదేశీ వస్తువులు దేశంలో ఇబ్బడిముబ్బడిగా అమ్ముడవుతున్నాయి. విదేశీ వస్తువుల దిగుమతికి సర్కార్ అనుమతి ఇస్తేనే ఇది సాధ్యమైంది. ఇక మీదట భారతీయ ప్రజానీకం మేడ్ ఇన్ ఇండియా అన్న కాన్సెప్ట్‌ని డెవలప్ చేసుకోవాలని ప్రధానమంత్రి కోరారు. విదేశీ వస్తువులను భారతీయులు కొనుగోలు చేస్తున్నారంటే పరదేశంపై మోజుతో కాదు. కారు చౌకగా నాణ్యమైన ఆ వస్తువులు మన దేశంలో లభించకపోవడం వల్లే. స్వదేశీ వస్తు వాడకం పెరగాలంటే దేశంలోకి విచ్చలవిడిగా ఎంట్రీ ఇస్తున్న విదేశీ వస్తువుల మీద సుంకాలు పెంచాలి ప్రతీకార సుంకాలు వేయాలి. అదే సమయంలో దేశంలో ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వాలి. అంతే కాదు నాణ్యతా ప్రమాణాలు బాగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. క్యాపిటల్ గెయిన్స్ విధానం సరళీకరణ, వ్యాపారాల్లోకి విదేశీయుల ఎంట్రీకి అనుమతి ఇచ్చిన మోడీ సర్కార్ మేక్ ఇన్ ఇండియా అంటే హాస్యాస్పదమే అవుతుంది. 1948 అక్టోబరు 1న రిపబ్లిక్ ఆఫ్ చైనాను స్థాపించించింది.దేశం కంటే ఓ ఏడాది ఆలస్యంగా చైనా దేశం ఏర్పడింది. కానీ తయారీ రంగంలో దూసుకెళ్లి ప్రపంచ దేశాలకు ఓ అవసరంగా మారింది. దీని వెనక చైనా ప్రభుత్వాల ప్రణాళిక బద్ధమైన కార్యాచరణ ఉంది. విద్య, పరిశోధనా రంగాలలో భారీ పెట్టుబడులు పెట్టింది. రోబోటిక్స్, కృత్రిమమేధల ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకుంది. మోడీ ప్రభుత్వం మాత్రం దేశీ, విదేశీ ప్రైవేటు పెట్టుబడులు మీద ఆధారపడి వస్తూత్పత్తి రంగంలో ముందుకు సాగుతోంది. ప్రభుత్వం చేతిలో ఉన్న అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ వస్తోంది. ప్రైవేటు రంగం లో వ్యక్తిగత లాభానికే ప్రాధాన్యత ఉంటుంది. దేశప్రగతి వారి ఉద్దేశంగా ఉండదు. విద్యను కాషాయీకరణ చేసేందుకు ఇస్తున్న ప్రోత్సాహం మోడీ సర్కార్ శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతికి ఇవ్వడంలేదు. మేక్ ఇన్ ఇండియా నినాదం ఎత్తుకొన్న వాటి విజన్ లేకపోవడమే మోడీ సర్కార్ ఈ నినాదం విఫలం కావడానికి కారణంగా మారింది.

# బీఆర్ఎస్ వ్యూహం ఏంటి?

హైదరాబాద్, సార్ సైలెంట్‌గా ఉన్నారు. వ్యూహాత్మక మౌనం పాటిస్తూ.. ఫాంహౌస్‌లోనే మీటింగ్‌లు పెడుతూ వస్తున్నారు. జూబ్లీహిల్స్ బైపోల్‌పై అయితే పెద్ద కసరత్తే చేస్తున్నారట. ఇప్పటికే అభ్యర్థిని డిసైడ్ చేసిన కారు పార్టీ..ప్రచార వ్యూహాలపై స్పెషల్ కాన్సంట్రేషన్ పెడుతోంది. ఎలాగైనా సిట్టింగ్ సీటును గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉంది గులాబీ పార్టీ. ఉప ఎన్నిక ప్రచారం ఊపందుకోగానే దళపతి కేసీఆర్ రంగంలోకి దిగబోతున్నారట. క్యాంపెయిన్‌లో భాగంగా జరిగే ఓ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందట బీఆర్ఎస్.

తెలంగాణలో బలంగానే ఉన్నామన్న సంకేతాలు పంపాలనే పట్టుదల..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకుంటుంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన ఈ స్థానాన్ని తిరిగి సాధించేందుకు గులాబీ పార్టీ సీరియస్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు జరిగిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ సిట్టింగ్ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందింది. దీంతో గ్రేటర్‌లో రెండో సీటుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వస్తుంది. ఎలాగైనా సిట్టింగ్ సీటును గెలిచి..అధికార కాంగ్రెస్ పార్టీకి ఝలక్ ఇవ్వాలని పట్టుదలతో ఉంది గులాబీ పార్టీ. జూబ్లీహిల్స్ బైఎలక్షన్స్‌లో గెలిచి తెలంగాణలో తాము బలంగానే ఉన్నామన్న సంకేతాలు ప్రజల్లోకి పంపాలని గులాబీ పార్టీ భావిస్తుంది. ఇందులో భాగంగా ఉపఎన్నికపై బీఆర్ఎస్ వ్యూహాలకు పదును పెడుతోంది.

ఆ ఎన్నికలపై ఎఫెక్ట్ పడొద్దన్నా, క్యాడర్‌లో జోష్ పెరగాలన్నా గెలుపు మస్ట్..!

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, ఆ తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ పోల్స్ వచ్చే అవకాశం ఉంది. అంతే కాదు జంపింగ్ ఎమ్మెల్యేల్లో పదికి పది కాకపోయినా కనీసం నాలుగు సీట్లకైనా ఉప ఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ లెక్కలు వేసుకుంటుందట. ఆ ఎన్నికలపై ఎఫెక్ట్ పడొద్దన్నా, క్యాడర్‌లో జోష్ పెరగాలన్న జూబ్లీహిల్స్‌లో గెలవడం తప్పనిసరని భావిస్తోందట కారు పార్టీ. అంతే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెద్దఎత్తున వ్యతిరేకత ఉందని చెబుతూ వస్తున్న బీఆర్ఎస్..ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచి ప్రజా వ్యతిరేకత ఉందని ప్రూవ్ చేయాలని భావిస్తోందట.ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించారు. ఎప్పటి నుంచో జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గ్రౌండ్ వర్క్ చేస్తోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఆరు డివిజన్లు ఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డివిజన్ల వారిగా సమావేశాలు పెడుతున్నారు. ఈ నియోజకవర్గంలో దాదాపు లక్షా 20 వేల ముస్లిం మైనారిటీ ఓట్లు ఉండగా ఆయా వర్గాలతోనూ కేటీఆర్ ప్రత్యేకంగా భేటీ అవుతూ..వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారని తెలంగాణ భవన్ వర్గాల టాక్. జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారంలో స్వయంగా కేసీఆర్ పాల్గొంటారని తెలుస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో డివిజన్ల వారిగా మొత్తం ఆరు బహిరంగ సభలు పెట్టాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో లాస్ట్ డే రోజు నిర్వహించే బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతారని సమాచారం. ఈ విషయంలో ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసెడెంట్ కేటీఆర్‌తో కేసీఆర్ చర్చించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అయితే కేసీఆర్ హాజరయ్యే ప్రచార సభ ఎక్కడ పెట్టాలన్నదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇలా చాలాకాలం తర్వాత మాజీ సీఎం కేసీఆర్ జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారన్న టాక్ బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్సాహం నింపుతోంటే.. రాజకీయవర్గాల్లో ఆసక్తి రేపుతోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలోని పలు అంశాలు, రాజకీయాలపై ఏం మాట్లాడతారు.. ఏయే విషయాలను ప్రస్తావిస్తారన్నది ఉత్కంఠ రేపుతోంది.

# ఇక డిఫమేషన్ కేసు వేయవచ్చా..?

న్యూఢిల్లీ,సమాజంలో గౌరవంగా జీవించడం పౌరుడి ప్రాథమిక హక్కు. ఆ హక్కుకు భంగం వాటిల్లితే అది ఏ రూపంలోనైనా సరే.. సదరు వ్యక్తి పరువు నష్టం కేసు వేసుకొని న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. పరువు నష్టం అనే కేసుపై భారత న్యాయ వ్యవస్థలో చాలా కాలంగా చర్చ జరుగుతూ వస్తోంది. మాటల ద్వారా, రచనలు, లేదంటే ప్రచురణల ద్వారా ఒక వ్యక్తి గౌరవాన్ని దెబ్బతీస్తే బాధిత వ్యక్తి పరువునష్టం కేసు వేసుకోవచ్చు. అయితే అది కేవలం పౌర న్యాయ పరిధిలో ఉండాలా? లేదంటే శిక్షార్హ నేరంగా పరిగణించాలా? అన్న ప్రశ్న ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది.

న్యాయమూర్తి వ్యాఖ్యలు ఇవే..

ఒక కేసు విషయంలో న్యాయమూర్తి ఈ విషయాన్ని మరోసారి తెరమీదకు తెచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన ఒక ప్రొఫెసర్ 'ది వైర్' అనే ఆన్‌లైన్ పబ్లికేషన్‌పై వేసిన పరువు నష్టం కేసు విచారణ సందర్భంలో న్యాయమూర్తి ఎంఎం సుందరేశ్ మాట్లాడుతూ 'వ్యక్తులు ఇలాంటి ఆరోపణలు ఎదుర్కోవడం నేరం కాదని నిర్ధారించాల్సిన సమయం వచ్చింది' అని వ్యాఖ్యానించారు. ఈ మాటలు కొత్త ఆలోచనలు రేకెత్తించినట్లు కనిపిస్తోంది. గతంలో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) లోని సెక్షన్ 499 అనేది డెఫమేషన్ క్రిమినల్ అఫెన్స్. అయితే బీఎన్ఎస్ లో దీన్ని సెక్షన్ 356 కిందికి తెచ్చారు. ఇది శిక్షకు అర్హమైన నేరం. ది వైర్ పబ్లికేషన్ విషయంలో న్యాయమూర్తి సుందరేశ్ చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి.

2016లో చట్టబద్ధత కల్పించే సుప్రీం కోర్టు..

ఇది ఇలా ఉంటే 2016లో సుబ్రహ్మణ్య స్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు తీర్పు సమయంలో డెఫమేషన్ కు రాజ్యాంగ బద్ధతను కల్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం 'జీవించే హక్కు అంటే కేవలం ప్రాణాలతో ఉండడం మాత్రమే కాదని, గౌరవంగా కూడా ఉండేదని' కోర్టు వ్యాఖ్యానించింది. అందువల్ల ఇతరులు వ్యక్తుల గౌరవాన్ని కించపరిచే చర్యలు తీసుకుంటే శిక్షార్హమని ఈ తీర్పు వెల్లడించింది. అప్పుడు అలా చెప్పిన న్యాయస్థానం ఇప్పుడు దానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో చర్చ మొదలైంది.

అసలు సమస్య ఇదే..

పరువు నష్టం అనేది వ్యక్తికి సంబంధించినది. అయితే దానిపై పరిహారం పొందాలంటే సివిల్ సూట్ల ద్వారా పొందవచ్చు. కానీ దానిని క్రిమినల్ ఆఫెన్స్‌గా మార్చడం వల్ల ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ (మాటల స్వేచ్ఛ)పై ప్రభావం పడుతుంది. ఇందులో ఎక్కువగా ఇరుక్కునేది జర్నలిస్టులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు.. వీరు ఎప్పుడూ ఈ కేసుల చుట్టే తిరుగుతుంటే.. సమాజానికి మేలు చేసే విమర్శ ఉండదు. ఇది సమాజంలో మార్పును తీసుకురాలేదు.

మార్పులు అవసరం అన్న న్యాయవాది..

అదే సమయంలో, గౌరవం కూడా వ్యక్తి ప్రాథమిక హక్కు కిందకే వస్తుంది. ఎవరైనా కావాలనే అసత్య ప్రచారం చేసి వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీయడం అనుమతించదగిన విషయం కాదు. కాబట్టి ఈ సమస్యలో సమతుల్యత ముఖ్యం. మాటల స్వేచ్ఛను కాపాడుకోవాలి, కానీ ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసే అవకాశాలను నిరోధించాలి. డెఫమేషన్ చట్టంలో మార్పులు రావాలని కపిల్ సిబాల్ లాంటి సీనియర్ న్యాయవాదులు చెప్పడం ప్రాముఖ్యత సంతరించుకుంది. పరువు నష్టం నేరం కాదని భావిస్తే, బాధితులకు పరిహారం అందించే సివిల్

# అన్నపూర్ణ అవతారంలో కనకదుర్గమ్మ

విజయవాడ, విజయవాడ ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రోత్సవాలు మూడో రోజు అట్టహాసంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. మంగళవారం గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మ బుధవారం అన్నపూర్ణగా అభయం ఇచ్చారు. దేశవ్యాప్తంగా శరన్నవరాత్రులు ప్రారంభమైనాయి. దుర్గమ్మ తొలి రోజు శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో.. రెండో రోజు వేదమాత శ్రీ గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక ముచ్చటగా మూడోరోజు.. అంటే బుధవారం అమ్మలగన్నయమ్మ.. ముగ్గురమ్మల మూలపుటమ్మ.. దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సృష్టి, స్థితి, లయకు కారణభూతమైన దుర్గమ్మ.. సమస్త జీవకోటికి ప్రాణాధారమైన ఆహారాన్ని అందించే దేవతగా శ్రీ అన్నపూర్ణదేవిని భక్తులు కొలుస్తారు. అన్నం.. జీవుల మనుగడకు ఆధారం. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపమని. ఉదకం నారాయణస్వరూపమని పెద్దలు చెబుతారు. ఈ రూపంలో అమ్మవారిని పూజిస్తే బుద్ధి వికాసం, సమయస్ఫూర్తి, కుశలత, వాక్‌శుద్ధి సిద్ధిస్తాయని శాస్త్ర పండితులు ఉవాచ. అన్నపూర్ణాదేవిని పూజిస్తే.. ఆకలిదప్పులు తదితర బాధలు ఉండవని చెబుతారు. అన్నపూర్ణాదేవి రూపం విశిష్టమైనది.. ఎందుకంటే.. ఎడమ చేతిలో బంగారు పాత్రతోపాటు- తన భర్త ఈశ్వరునికి భిక్ష అందించే రూపంలో అన్నపూర్ణను దర్శించుకుంటే ఆకలి బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ రూపంలో అమ్మవారిని ధ్యానిస్తే.. ధనధాన్యవృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయి. అమ్మవారి చేతిలోని అక్షయ పాత్ర సకల శుభాలను కలిగిస్తుంది. లోకంలో జీవుల ఆకలి తీర్చడంకన్నా మించినది ఏదీ లేదని ఈ అలంకారం వెనుక ఉన్న అర్థం పరమార్థం.. అన్నపూర్ణ దేవిని తెలుపు, పసుపు పూలతో పూజించాలి. అన్నపూర్ణాదేవి స్తోత్రాలతోపాటు- ఆదిశంకరాచార్యులు రచించిన సౌందర్యలహరిని పారాయణం చేస్తే శుభ ఫలితాలు సంప్రాప్తిస్తాయని పెద్దలు చెబుతారు. అన్నపూర్ణ దేవిని తెలుపు, పసుపు పూలతో పూజించాలి. తెల్లవారుజామున 4 గంటలకే అమ్మ వారని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మంగళవారం ఒక్క రోజు అమ్మవారిని లక్ష మంది భక్తులు దర్శించుకున్నారని దేవాలయ ఉన్నతాధికారులు వెల్లడించారు. అలాగే ప్రసాదం, దర్శన టికెట్ల ద్వారా దేవస్థానానికి భారీగా ఆదాయం వచ్చిందని తెలిపారు. దసరా నవరాత్రులు నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు విజయవాడకు తరలి వస్తున్నారు. అమ్మవారి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు- చేసింది. అదీకాక.. విజయవాడలో కృష్ణా నదికి వరద పోటెత్తింది. దీంతో నదీ ఘాట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం విద్యుత్, నీటి పారుదల, దేవాదాయ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కమిషనర్ సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనాల కోసం రద్దీ కొనసాగింది. పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఇక ప్రసాద విక్రయాలు, టిక్కెట్ల అమ్మకాలతో రెండో రోజు సాయంత్రం 5 గంటలకే ఆలయానికి రూ.25.48 లక్షల ఆదాయం సమకూరినట్లుగా ఆలయ అధికారులు వెల్లడించారు. రూ.300 టిక్కెట్లపై రూ.8.99 లక్షలు, రూ.100 టిక్కెట్లపై రూ.3.16 లక్షలు, లడ్డూ ప్రసాద విక్రయాలపై రూ.11.53 లక్షల ఆదాయం వచ్చినట్లు-గా ఈవో వీకే శీనానాయక్ వెల్లడించారు. ఇంకోవైపు నగరంలో విజయవాడ ఉత్సవ్ అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ ఉత్సవ్‌కు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో భారీగా పోలీసులు మోహరించారు.

# అమరావతిపై వైకాపా కుట్రలు

అమరావతి,అమరావతిలో వైకాపా కుట్రల వల్ల జరిగిన విధ్వంసాన్ని సరిచేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గతంలో పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లు ఇప్పుడు ముందుకు రాలేదని, అందుకే మళ్లీ టెండర్లు పిలవాల్సి వచ్చిందన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శాసనభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతిలో సీఆర్డీఏ నుంచి 21 పనులు, ఏడీసీ నుంచి 64 పనులు జరుగుతున్నట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం రాజధానిని నిర్వీర్యం చేసి మూడు ముక్కలాట ఆడిందని.. దీంతో అమరావతిలో అడవిలా పెరిగిన చెట్లను తొలగించేందుకు రూ.30 కోట్లు- ఖర్చు పెట్టాల్సి వచ్చిందన్నారు. రాజధానిలో ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జీల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. మార్చి 31 నాటికి 3,500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. 2019కి ముందు పనులు చేసిన కొందరు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంపై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం.. చిన్న కాంట్రాక్టర్ల విషయంలో తేడా ఎందుకు చూపుతోందని అడిగారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపును పరిశీలిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.హడ్కో, ప్రపంచ బ్యాంకు ద్వారా రాజధాని నిర్మాణానికి రుణాలు తీసుకున్నాం. పనులు ప్రణాళికబద్ధంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయ్యాక ప్రధానిని పిలిచి ప్రారంభోత్సవం చేస్తాం. ఆమదాలవలసలో అమృత్-2లో భాగంగా అక్రమాలు జరిగింది నిజమే. కట్ట నిర్మాణ పనులతో పాటు- మరికొన్నింటి విషయంలో నిధుల దుర్వినియోగం జరిగింది. కమిటీ- నివేదిక వచ్చింది.. దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని నారాయణ తెలిపారు. ట్రంక్ రోడ్లు, లే అవుట్ రోడ్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్జిల బంగ్లాలు, అధికారులు, ఉద్యోగుల నివాసాలు నిర్మాణం జరుగుతుందన్నారు. గత రెండు నెలలుగా వర్షాల వల్ల అమరావతి నిర్మాణ పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. ప్రస్తుతం 10 వేల మంది కార్మికులు అమరావతి పనుల్లో పాల్గొంటున్నారని.. మార్చి 31 నాటికి 3500 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. జాతీయ,అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో టెండర్ నిబంధనలు పెట్టామని మంత్రి నారాయణ వెల్లడించారు.విశాఖ మౌలిక సదుపాయాలకు సంబంధించి అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయ సమాధానం ఇచ్చారు. జీవీఎంసీని నియోజకవర్గాల ప్రాతిపదికన 10 జోన్‌లుగా విభజించామని... త్వరలోనే దీనిపై అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. జోనల్ కమిషనర్‌లకు అధికారాలపై పరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. విశాఖలో రూ.665 కోట్లతో సీవరేజి ప్రాజెక్ట్‌కు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. జీవీఎంసీ పరిధిలో తాగునీటి కోసం కొత్తగా ప్రాజెక్ట్ అమలు చేయనున్నామని తెలిపారు. విశాఖపట్నంలో డ్రెయిన్లు 4863 కి.మీ మేర అవసరం ఉండగా 3583 కిమీ మేర ఉన్నాయని.. మరో 193 కిమీ మేర డ్రెయిన్ల పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. విశాఖలో రోడ్లు వెడల్పు చేసిన చోట వివిధ కారణాలతో టీ-డీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సింహాచలం టీడీఆర్ బాండ్లపై దేవదాయ శాఖ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. తణుకు టీడీఆర్ బాండ్ల వివాదం తర్వాత ఇతర కార్పొరేషన్‌ల లో బాండ్ల జారీ ఆలస్యం అయిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడమే ట్రంప్ లక్ష్యం !



న్యూఢిల్లీ,ట్రంప్ టారిఫ్‌లు, వీసా ఫీజులు అంతా కూడా కేవలం భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే. భారత్ ఆర్థిక మూలాలలను దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తున్నాయి. అమెరికాకు మోకరిల్లాలే తప్ప కాలర్ ఎగరేసుకుని తిరగరాదన్న ఆధిపత్య ధోరణి ట్రంప్‌లో కనిపిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి అన్నది ఒక సాకు మాత్రమే. భారత్ ఆర్థిక శక్తిగా ఎదగడాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు. ఇందులో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఓట్ల కోసం భారత్‌ను,ఎన్నారైల కాళ్లావేళ్లా పడి,మోడీతో చెలిమిని నటించిన ట్రంప్ గెలిచాక గేర్ మార్చడం వెనక సొంత ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. భారత్ ఆర్థికంగా ఎదిగితే తమకు పోటీదారు అవుతుందన్న బెంగ ప్రధానంగా ఉంది. దీనికితోడు సైనికంగా స్వయం సమృద్ధిని సాధించడానికి కూడా ట్రంప్ తట్టుకోలేక పోతున్నాడు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ తరవాత ఆయనలో అసహనం పెరిగింది.భారత్ సైనిక సత్తాచాటడం స్వదేశీ ఆయుధాలతోనే పాక్ పీచమణిచింది. పాక్‌లో స్థావరం ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న అమెరికాకు ఇది గిట్టడం లేదు. పాక్‌కు తాము సరఫరా చేసిన ఆయుధా లు కూడా పనిచేయకపోవడం అవమానంగా భావిస్తోంది. ఈక్రమంలోనే పాక్ ఆర్మీ చీఫ్‌ను పిలిచి ట్రంప్ మరీ చంకన కూర్చోబెట్టుకున్నారు. పాక్‌తో వాణిజ్యం మొదలు పెట్టారు. పాక్ ఆయిల్ అమ్మకం దారుగా ఎదుగుతుందని, భారత్ కూడా కొనాల్సి వస్తుందని బెదరించారు. ఇలా చేస్తూనే 50శాతం సుంకాలను ఎకాఎకిన పెంచేశారు. అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తులను కొనేలా ఒత్తిడి తెస్తున్నారు. మొత్తంగా భారత్ మార్కెట్‌ను దెబ్బతీసే కుట్ర కూడా ఇందులో దాగివుంది. ఇదే క్రమంలో వీసా పిడుగులు కురిపించారు. ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేశారు. ఓ రకంగా ఇదో బెదరింపు చర్యగా చూడాలి. 70శాతం పైగా హెచ్-1 వీసాదారులు భారతీయులు. అందుకే దీని ఫీజును అమాంతంగా లక్ష డాలర్లు చేశారు. తొలిరోజు ప్రకటన చేసే సమయంలో అక్కడి కామర్స్ మినిస్టర్ ఇది ఏడాదికోమారు ఉంటుందని, వెంటనే అమల్లోకి వస్తుందని ప్రకటించారు. దీంతో అమెరికాలో ఉన్న భారతీయ వీసాదారులు భయపడ్డారు. తరవాత ప్రెస్ సెక్రటరీ విడుదల చేసిన నోట్‌లో పూర్తి భిన్నంగా ఉంది. లక్ష డాలర్ల ఫీజు కొత్త వారికేనని, పాతవారికి, రెన్యువల్ చేసుకునే వారికి లేదని,ఇది వచ్చే యేడు నుంచి అమల్లోకి వస్తుందని వివరణ ఇచ్చారు.మొత్తంగా ఇదంతా భారత్‌ను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవే అని తేలింది. ఈ క్రమంలో భారత్ కూడా అప్రమత్తంగా ఉండాలి. దేశీయంగా మన టెక్నాలజీకి పదను పెట్టాలి. మన దగ్గరే ఉద్యోగావకాశాలు పెంచాలి. ఓ రకంగా చెప్పాలంటే ట్రంప్‌తో పాటు, పాక్ కూడా మోడీ తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకి స్తున్నాయి. అందుకే పాక్ అమెరికాకు మరింత దగ్గరకావడానికి అవకాశం వచ్చింది. ఒసామాబిన్ లాడెన్ ఉగ్రచర్యలను ట్రంప్ మరచిపోయారు. పాక్‌ను దువ్వి పాలు పోస్తున్నారు. దీనికి అమెరికా మూల్యం చెల్లించుకోక తప్పదు. పాక్ కూడా అమెరికా అండతో భారత్‌పై మరింత కాలుదువ్వే అవకాశాలు ఉన్నాయి. ఉగ్రచర్యలను ప్రేరేపించవచ్చు. ఎందుకంటే మోడీ ఉన్నంత కాలం తమదేశం స్వేచ్ఛగా ఉంటుందన్న నమ్మకం కోల్పోయింది. గతంతో పోలిస్తే మోడీ పాక్ పట్ల కఠినంగానే ఉంటున్నారు. అణుబెదిరింపులను పూచికపుల్లతో తీసేసారు. ప్రతిగా ఘాటుగా సమాధానం ఇస్తున్నారు.మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంనుంచి దిగిపోవాలని పాక్ చూస్తోంది. అందుకు ఇప్పుడు పాకిస్తాన్‌తో సంబంధాలు మోడీకి ముందు, మోడీకి తర్వాత అన్నట్లుగా మారాయి. గతంలో పాకిస్తాన్ ఎన్ని ఉగ్రవాద దాడులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం కానీ దౌత్య సంబంధాలను పూర్తిస్థాయిలో తగ్గించుకునే ప్రయత్నం చేయలేదు. పాకిస్తాన్ పట్ల విదేశాంగ విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. పాకిస్తాన్‌లో పౌర ప్రభుత్వం ఉన్నా, సైనిక ప్రభుత్వం ఉన్నా దౌత్య సంబంధాలు బాగానే ఉన్నాయి. కొన్ని సార్లు బ్యాక్-ఛానెల్ దౌత్యం ద్వారా రెండు దేశాలు సంబంధాలు నెరిపాయి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత, స్వయంగా అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంట్లో శుభకార్యం ఉంటే లాహోర్ వెళ్లాడు. పాక్‌కి స్నేహ హస్తం చాచారు. కానీ, యథావిధిగా పాకిస్తాన్ తన బుద్ధి చూపిస్తూ వచ్చింది. పఠాన్ కోట్, ఉరీ, పుల్వామా, పహల్గామ్ ఇలా ఉగ్రవాద దాడులకు పాల్పడుతూనే ఉంది.ఇన్నాళ్లు పాకిస్తాన్‌కు ఓ ధీమా ఉండేది. భారత్‌పై దాడి చేస్తే, పాకిస్తాన్‌ను నిందిం చడం, ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోరనే ధీమాతో ఉండేది. కానీ, మొదటిసారిగా ఉరీ దాడి తర్వాత, భారత సైన్యం పీఓకేలోకి వెళ్లి సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. పుల్వామా దాడి తర్వాత బాలాకోట్ స్ట్రయిక్స్ చేసింది. తాజాగా, పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ తో పాక్ సైన్యం ఎయిర్ బేసులతో పాటు-, పాకిస్తాన్ లోపల ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఇలా భారత్ ప్రతీకారం తీర్చు కోవడం అనేది, మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే జరుగుతుండటంతో పాకిస్తాన్, ప్రస్తుత ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్, రాహుల్ గాంధీలను పాక్ నాయకులు, ఆ దేశ సెలబ్రిటీలు ప్రశంసించడం చూస్తుంటే, అప్పటి యూపీఏ హయాంలోనే మా పరిస్థితి బాగుండేది అని భావిస్తున్నట్లు- కనిపిస్తోంది. అంతేగాకుండా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పాక్ పాలకు తీరును బట్టి అర్థం అవుతోంది. పాకిస్తాన్‌తో 1965, 1971, 1999 కార్గిల్ వార్ సమయాల్లో కూడా మన దేశం పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను ఎప్పుడూ పూర్తిగా తెంచుకోలేదు. పాక్‌కి ఆధారమైన సిందూ నది ఒప్పందంను ఎప్పుడూ నిలుపుదల చేయలేదు. కానీ మోడీ వచ్చిన తర్వాత దాయాదికి క్లియర్ మెసేజ్ ఇచ్చారు. రక్తం, నీరు కలిసి ప్రవహించవని చెప్పి, సిందూ ఒప్పందాన్ని నిలిపేశారు. దీంతో ఒక్కసారిగా పాకిస్తాన్ లో హాహాకారాలు మొదలయ్యాయి. ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగే ప్రసక్తే లేని స్పష్టం చేశారు. ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగవని చెప్పారు. అలాగే మనదేశంలో కూడా మోడీ రాకతో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ లభించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు, పాక్ కవ్వింపులను ధీటుగా ఎదుర్కొనేందుకు ఎలాంటి అనుమతులు అక్కర లేకుండా వెంటనే నిర్ణయం తీసుకునే వెసులుబాటు సైన్యానికి కల్పించారు. గతంలో సరిహద్దుల వెంబడి పాక్ సైన్యం కాల్పులు జరపడం, మన సైనికుల్ని అపహరించి తలలు నరికిన సందర్భాలు ఉన్నాయి. కానీ మోడీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పాక్ యాక్షన్‌కు అంతకన్నా సీరియస్ రియాక్షన్ ఉంటుందని తన చర్యల ద్వారా స్పష్టం చేశారు. దీంతో సైన్యం కూడా పాక్‌ని ఎప్పటికప్పుడు దెబ్బ తీస్తుంది. ఇన్నాళ్లు, పాకిస్తాన్ తన అణ్వాయుధాలను చూపిస్తూ బ్లాక్‌మెయిల్ చేసేది, ఆపరేషన్ సిందూర్‌తో ఇక ఈ బ్లాక్‌మెయిల్‌ని సహించేది లేదని భారత్ స్పష్టం చేసింది.

# పన్నుల తగ్గింపు..సంస్కరణ అవుతుందా?

న్యూఢిల్లీ,జిఎస్టీ తగ్గింపును సంస్కరణలుగా చెప్పుకుంటూ....ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు. ఇది ఎలా సంస్కరణ అవుతుందో ప్రధాని మోడీ, ఆయనను కీర్తిస్తున్న వారు చెప్పాలి. ప్రజలు కట్టే పన్నులతో అభివృద్ధి చేశామని చెబుతున్న వారు ఎంతగా వంచిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఎంపిలు, ఎమ్మెల్యేల జీతాలు తగ్గిస్తే సంస్కరణ అనుకోవాలి. వారికి పెన్షన్లు తొలగిస్తే అది కూడా ఓ సంస్కరణగా భావించవచ్చు. గవర్నర్ వ్యవస్థను తొలగిస్తే సంస్కరణ అనుకోవాలి. ఆరోవేలుగా ఉన్న శాసనన మండలులను రద్దు చేస్తే అదీ ఓ సంస్కరణ అనుకోవాలి. అలాగే ఎంపిటిసి, జడ్పీటిసిలను రద్దు చేసినా ఓ సంస్కరణగానే గుర్తించాలి. ఇకపోతే ఉచిత పథకాలను రద్దుచేస్తే సంస్కరణలు అనుకోవచ్చు. కానీ ఇవేవీ చేయకుండా 8ఏళ్ల క్రితం జిఎస్టీని తీసుకుని వస్తూ..ఒకే దేశం ఒకే పన్ను అంటూ గొప్పలు చెప్పుకుని ప్రజలను పన్నుల రూపంలో పీల్చి పిప్పి చేశారు. కానీ ఏనాడు తగ్గించమని అడిగినా ససేమిరా అన్నారు. హెల్త్ స్కీమ్‌లు, ఇన్సూరెన్స్‌ల పైన వేసిన జిఎస్టీని తగ్గించమని పార్లమెంట్ వేదికగా కోరితే నిర్ద్వందంగా తిరస్కరించిన ఘనత ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ది. కనీసం ఆలోచిస్తామని కూడా చెప్పలేదు. స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరినా నో చెప్పారు. అలాంటి వారు ఇవాళ ప్రజల్లో వ్యతిరేకత వస్తున్న తరుణంలో జిఎస్టీ స్లాబులను తగ్గించారు. ఇదికేవలం పెంచిన దాంటలో తగ్గింపు మాత్రమే. ఇది సంస్కరణ ఎలా అవుతుందో చెప్పాలి. మోడీని సమర్థిస్తూ..నిత్యం కీర్తిస్తున్న చంద్రబాబు సైతం గొప్ప ఆర్థిక సంస్కరణగా చెప్పుకోవడం, అసెంబ్లీలో తీర్మానం చేయడం విడ్డూరం కాక మరోటి కాదు. ఉమ్మడి ఎపిలో బియ్యం ధరలను పెంచిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు పెంచడం లేదో చెప్పాలి. ఏళ్ల తరబడి ప్రజలను పీల్చి పిప్పి చేసిన అనంతరం వస్తు సేవల పన్ను విధానంలో కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకువచ్చిన మార్పుల తీరు చూస్తుంటే ఎంతగా రాజకీయ చతురత చూపాలనుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ చర్యతో భారీ మొత్తంలో పన్నులు తగ్గాయని, సామాన్యులు పండగ చేసుకోవచ్చని పాలకులు చెబుతున్న ప్పటికీ వాటి ఫలితాలు సామాన్యులకు అందడంపై సందేహాలు నెలకొన్నాయి. అయినా ఇంతకాలం ఎందుకు పండగ చేసుకోనీయలేదన్న ప్రశ్నలకుకూడా సమాధానం రావాలి. ఈ నెల 22వ తేదీ నుండి నూతన జిఎస్‌టి విధానం అమలులోకి రాగా, ఒక రోజు ముందు దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దసరా, దీపావళి పండగ సీజన్‌ను 'జిఎస్‌టి సేవింగ్స్ ఫెస్టివల్'గా అభివర్ణించడం మసిపూసి మారేడు కాయ చేయడం అంటారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీని అభినందిస్తూ అసెంబ్లీ ఉభయ సభల్లోనూ తీర్మానాలు చేసింది. శాసనసభలో జిఎస్‌టి 2.0 వల్ల కలిగే ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ ప్రసంగం చేశారు. అయితే, ప్రధాని నరేంద్రమోడీగానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ ఇన్ని సంవత్సరాల పాటు ప్రజలపై మోపిన భారాన్ని గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. అలాగే ఒక కుటుంబానికి కలిగే ప్రయోజనం ఎంతో కూడా వారు చెప్పలేదు. నిజానికి, ఏ వస్తువుపై ఎంత ధర తగ్గుతుందన్న నిర్దిష్టమైన వివరాలను కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించడంలేదు. ఇప్పటికీ షాపుల వారు మాత్రం పాత ధరలనే అమ్ముతున్నారు. జిఎస్టీ మార్పులపై ప్రకటన చేయడం లేదు. టీవీ షోరూమ్‌లు, కార్ల షోరూమ్‌లలో మాత్రం కొంత హడావిడి కనిపిస్తోంది. ఏకీకృత పన్ను విధానం పేరుతో కార్పొరేట్ల



ప్రయోజనాల కోసం జిఎస్‌టిని 2017లో దేశంపై నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం రుద్దింది. దశాబ్దాలుగా అనుసరించిన ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా సామాన్యుడి కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గింది. జిఎస్‌టిలో ఉన్న సంక్లిష్టత, అపరిమిత శ్లాబుల కారణంగా నిత్యావసర ధరలు భారీగా పెరిగి దేశ వ్యాప్తంగా గగ్గోలు చెరేగింది. ప్రతిపక్షాలు దీనిని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించాయి. మరోవైపు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా తగ్గాయి. అదే సమయంలో ట్రంప్ టారిఫ్‌ల ప్రభావమూ పడింది. దీంతో ప్రజల ప్రయోజనాలు ఎలా ఉన్నప్పటికీ కార్పొరేట్ల కోసమైనా దేశీయ మార్కెట్‌ను పెంచడం కోసం జిఎస్‌టిని తగ్గించక తప్పనిస్థితి ఏర్పడింది. వారికి లాభం చేకూర్చా లంటే జిఎస్టీ తగ్గించాలన్న పరిస్థితి ఎదురయ్యింది. దీనికితోడు చుట్టుపక్కల దేశాల్లో ప్రజల్లో అసహనం పెల్లుబికింది. ఇవన్నీ గమనించిన ఏలినవారు జిఎస్టీ తగ్గించడం తప్పదని గుర్తించారు. కార్పొరేట్లు కూడా ధరల తగ్గింపు గురించి ఇచ్చిన సూచనలు పాటించారని అర్థం అవుతోంది. అదే సమయంలో ధరలను నేరుగా తగ్గించే అవకాశాలను మాత్రం పరిశీలించడం లేదు. స్టీలు, సిమెంట్, ఔషధాల ధరలను తగ్గించడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 55 లక్షల కోట్ల రూపాయలను గత ఏడు సంవత్సరాల్లో జిఎస్‌టి ద్వారా ప్రజల మూలుగలు పిండి మోడీ సర్కారు వసూలు చేసింది. దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించే చేనేత రంగానికి అవసరమయ్యే ముడి సరుకులను అదే శ్లాబులో ఉంచారు. కొన్ని రకాల ఔషధాలను జీరో శ్లాబులో ఉంచినట్లు- చెబుతున్నప్పటికి, వాటి తయారీకవసరమైన ముడి పదార్థాలపై పన్ను విధించారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన 24 గంటల తరువాత కూడా పాలతో పాటు- నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. పాత స్టాక్‌కు తగ్గింపు వర్తించదని అంటున్నారు. పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను కొద్ది రోజుల కిందటే పెంచాయి. వీటిపై జిఎస్‌టిని తగ్గించినా,పెద్దగా ఫలితం కనిపించడంలేదు. సామాన్యుడికి ప్రయోజనం కలిగించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్నా జిఎస్‌టి రేట్ల తగ్గింపు వివరాలను నిర్దిష్టంగా సరుకుల వారీగా ప్రకటించాలి. అలాగే కరోనా తరవాత ఇబ్బడిముబ్బడిగా పెంచిన ఔషధాల ధరలను తగ్గించాలి. రాజకీయనాయకులు జీతభత్యాలను వెంటనే తగ్గించాలి. రాజకీయ నాయకులకు పెన్షన్లు ఎత్తేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే దేశీయ ఉత్పత్తులకు, ఎంఎస్‌ఎంఇలకు ఊతం లభిస్తుంది. ఈవిషయాలపై స్పష్టత ఇస్తే..అందుకు అడుగులు వేస్తే వాటిని మాత్రమే సంస్కరణలు అనవచ్చు.

# బిజెపి క్రమంగా బలపడుతోంది

హైదరాబాద్,తెలంగాణలో బీజేపీ క్రమంగా ఎదుగుతోందని, ఒకప్పుడు గ్రామాల్లో ఒకటి రెండు ఓట్లు వచ్చిన చోట ఇప్పుడు వందల సంఖ్యలో ఓట్లు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని గుర్తించారని, గెలుపు చూస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని ఎన్నికలను గెలువడంతో పాటు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించబోతున్నామని భరోసా ఇచ్చారు. మోడీ పాలన, బిజెపి పనితీరు ఇందుకు నిదర్శనమని అన్నారు. రామచందర్ రావు అధ్యక్షతన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇందులో భాగంగా.. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ ఇచ్చారని కాంగ్రెస్, కేసీఆర్ తెచ్చారని బీఆర్ఎస్ చెబుతున్నాయని.. కానీ, పార్లమెంట్‌లో బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. గత పదేళ్లుగా పాలకులు మాటలతో మభ్యపెట్టారని, కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క డిక్లరేషన్ కూడా అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని, గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయలేకపోతున్నాయని అన్నారు. అలాగే బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని, అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం తెచ్చిందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, జీఓ ఇస్తే తాము కూడా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జీఎస్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలకు లాభం చేకూరిందని, నిత్యావసరాలు తక్కువ ధరలకు దొరకడానికి మోడీయే కారణమని చెప్పారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ వంటి కేంద్ర పథకాలు తెలంగాణలో ప్రజలకు చేరడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి 12 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని తెలిపారు. ఇంకా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లోటు- చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తుందని విమర్శించారు. ఎరువుల కొరత రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా లోపమేనని అన్నారు. ఆఫీస్ బేరర్లు హైదరాబాద్‌ను వదిలి గ్రామాలకు వెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్రం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలోని స్థానిక ఎన్నికలను ఆపొద్దని, వాటిలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కిషన్ రెడ్డి నాయకత్వంలో వంద శాతం బీజేపీ గెలుస్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఆట చేతగాక కిషన్ రెడ్డిపై మాట్లాడుతున్నారని విమర్శించారు.

# లాజిక్ రివర్స్ !

హైదరాబాద్,దేశవ్యాప్తంగా జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల వేళ బీజేపీ రెండవ తరం జీఎస్టీ ఆదా ఉత్సవాలను జరుపుకుంటోంది. ప్రస్తుతం బీజేపీ మొత్తం అంతా దీని మీదనే ఫోకస్ పెట్టింది. టాప్ టూ బాటమ్ నాయకులు పార్టీ శ్రేణులు అంతా దీని మీదనే పీక్స్ లో ప్రచారం చేస్తున్నారు. దసరా పండుగను దీపావళితో కలిపి ముందే ప్రతీ పేదింటి ముంగిటకు చేర్చామని బీజేపీ పెద్దలు చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇక నరేంద్ర మోడీ అయితే ఈ విషయం మీద పబ్లిక్ మీటింగ్స్ లో మాట్లాడుతూనే జాతిని ఉద్దేశించి ప్రత్యేకంగా సందేశం ఇచ్చారు. అంతే కాదు దేశ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. బీజేపీ నాయకులు అయితే ప్రతీ నట్టింట బీజేపీ ఆదా చేసిన ఆదాయం ఎంతో లెక్క కట్టి మరీ వివరిస్తున్నారు.

### అదుపూ పొదుపూ మీదే :

ప్రతీ సామాన్యుడి జేబులో నుంచి నెలలో పోయే పదిహేను వేల మొత్తాన్ని అలాగే పర్సులో ఉంచేశామని కాషాయం నేతలు అంటున్నారు. ఖర్చు పెట్టాల్సిన సొమ్ము ఇంటి గడప దాటలేదు అంటే పేదలకు మధ్యతరగతి వర్గాలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా కాకపోయినా పరోక్షంగా ఇస్తున్న అద్భుతమైన నగదు బదిలీ కానుకే కదా ఇది అని విశ్లేషించి మరీ చెబుతున్నారు. దాంతో బడ్జెట్ పద్మనాభాలు అంతా అవును సుమీ అనుకోవడమూ మొదలెట్టారు. జేబులు తడుముకోవడమూ ఒకటికి పదిసార్లు చేస్తూ బరువు బాగానే ఉందా లేదా అని టెస్ట్ చేసుకుంటున్నారు.

### లాభమెంతో తేలలేదు కానీ :

అయితే పాలు ఉత్పత్తుల విషయంలో తగ్గుదల ఉంటుందని 22 నుంచే అమలు అవుతుందని భావించిన సగటు జీవి కి తెల్లవారుతూనే తొలి షాక్ పాల ప్యాకెట్ నుంచే తగిలింది. టెట్రా ప్యాక్ లకు తప్పించి మామూలు పాల ప్యాకెట్లకు ఈ తగ్గింపు వర్తించదు అన్న సత్యాన్ని తెల్సుకున్న మీదట ఖంగు తినడం బడుగు జీవి వంతు అయింది. మార్కెట్ కి షాపింగ్ కి వెళ్తే పాత రేట్లతోనే బిల్లు బాదింది. దాంతో ఏమిటిది అంటే కొత్త రేట్లు కొత్త సరుకుతోనే అన్న సమాధానంతో మరో షాక్ ట్రీట్మెంట్ దొరికింది.

### వాటి ధరలే తగ్గాయా :

విలాస వస్తువుల ధరలే తగ్గాయని అంటున్న మాట. అంటే కార్లు బైక్స్, టీవీలు వంటివి అన్న మాట. నిత్యం తినే పప్పులో మినపప్పు ధర అలాగే ఉంది. జీఎస్టీ దాని మీద ఉంది. అందుకే ఇడ్లీ దోశ రెండూ ఖౌల్లు మంటున్నాయి. అలాగే బ్రాండెడ్ బియ్యం ధరలు సైతం అలాగే ఉన్నాయని అంటున్నారు. మరో వైపు చూస్తే నెలకు పదిహేను వేలు ఆదా అవుతుందని ఊదరగొడుతున్నట్లుగా అంత స్థాయిలో ఆదా ఏమైనా జరుగుతోందా అన్న ధర్మ సందేహం అయితే సగటు జనాన్ని వేధిస్తోంది అంటున్నారు.

### వీటిని తగ్గించండి మహా ప్రభో :

ఇక అందరికీ నిత్యావసరాలుగా ఉన్నవి పెట్రోల్ డీజిల్, అలాగే వంట గ్యాస్. వీటిని అర్జంటుగా తగ్గిస్తే పెద్దల కాళ్ళు కడిగి పేదోళ్ళు నెత్తిన చల్లుకుంటారు కదా అని అంటున్నారు లీటర్ పెట్రోల్ యాభై చేస్తే దసరా దీపావళి ఏంటి అన్ని పండుగలూ ఇంటి ముందే కొలువుంటాయని అంటున్నారు. అలాగే బీజేపీ కేంద్రంలో గద్దెనెక్కినపుడు వంట గ్యాస్ సిలిండర్ బండ నాలుగు వందల లోపే ఉందని గుర్తు చేస్తున్నారు. అందువల్ల దానికి తగ్గిస్తే ఏ మూడు వందలుగా చేస్తే కాషాయ పెద్దలను శాశ్వతంగానే తలచుకుంటారు అని అంటున్నారు.


# పనిచేసేది ఆంధ్రప్రదేశ్‌వారే!

న్యూఢిల్లీ,తెలంగాణ తెచ్చుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం! కానీ.. ఢిల్లీ స్థాయిలో తెలంగాణ నిరుద్యోగులకు అదీ.. అక్కడి ఉన్న తెలంగాణ భవన్‌లో అన్యాయం జరుగుతున్నది. డిప్యూటేషన్ పేరిట ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల వారిని వివిధ హోదాల్లో తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా ఆంధ్ర అధికారుల పెత్తనం కొనసాగుతుండటం గమనార్హం. ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కనీసం తెలంగాణ భవన్‌లో జరుగుతున్న విషయాలను కూడా పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు.

### రెసిడెంట్ కమిషనర్‌కన్నా ఆమె పవర్‌ఫుల్!

తెలంగాణ భవన్‌లో రెసిడెంట్ కమిషనర్ కన్నా ఒక మహిళా అధికారి అజమాయిషీ చెలాయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. పక్క రాష్ట్రమైన ఏపీ ప్రభుత్వంలో రాజమండ్రి డిగ్రీ కాలేజీలో స్టోర్ కీపర్‌గా పని చేస్తున్న మహిళా ఉద్యోగిని తెలంగాణ భవన్‌కు ఇంటర్ స్టేట్ డిప్యూటేషన్‌పై తీసుకొచ్చేందుకు ఆమె ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సదరు మహిళకు అనుమతినిస్తూ జీవోసైతం వారం క్రితమే జారీ చేసింది. రేపో మాపో ఆమె తెలంగాణ భవన్‌లో ఉగ్యోగంలో చేరనున్నారని తెలుస్తున్నది.

# రాజకీయాలకు దూరంగా బండి సంజయ్?



హైదరాబాద్, ఆయన స్పైసీ కామెంట్స్‌కు కేరాఫ్. సైలెంట్‌గా ఉంటారు. సడెన్‌గా ఏదో ఒక ఇష్యూను లేవనెత్తి లైమ్‌లైట్‌లోకి వచ్చేస్తారు. మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ లీడర్లను ఇరకాటంలో పెట్టడంలో ముందుంటారు. పార్టీ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు ఆయన ఇచ్చే స్టేట్‌మెంట్లు ఎలా ఉండేవో తెలియంది కాదు. లేటెస్ట్‌గా బీఆర్ఎస్ లీడర్లు.. లగ్జరీ కార్లు అంటూ బ్లాస్టింగ్ కామెంట్స్ చేసి చర్చకు దారి తీసిన బండి..ఆ తర్వాత ఆల్ ఆఫ్ సడెన్‌గా సైలెంట్ అయిపోయారు. ఇక నో పాలిటిక్స్ ఓన్లీ డివోషనల్ అంటున్నారట. బండి పొలిటికల్ బ్రేక్ ఎందుకు? ఆయన నోటి నుంచి మళ్లీ మాస్ మసాల కామెంట్స్ ఎప్పుడు?

రాజకీయాలకు ఎంతకాలం దూరంగా ఉంటారో?

బండి సంజయ్. ఆయన ఏ పదవిలో ఉన్నా.. ఫైర్ బ్రాండ్ లీడర్‌గా..ఆయన ఏది మాట్లాడినా సెన్సేషనే. ఆయన ఒక్క స్టేట్ మెంట్ ఇస్తే చాలు రాష్ట్ర రాజకీయాలన్నీ ఆ ఇష్యూ చుట్టూ తిరగాల్సిందే. కార్యక్రమం ఏదైనా..ఇష్యూ ఇంకేదైనా బండి చేసే కామెంట్స్ సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటాయి. పాలిటిక్స్‌కు సంబంధం లేని కార్యక్రమాల్లో పాల్గొన్నా దానిని అటు తిప్పి ఇటు తిప్పి రాజకీయాలకు ముడి పెట్టడం బండి స్పెషాలిటీ. హిందుత్వానికి లింక్ చేసి రాజకీయాలను రక్తి కట్టిస్తారు బండి సంజయ్. అటువంటి బండి సంజయ్ రాజకీయాలకు దూరంగా ఉండనున్నారట. అవును పాలిటిక్స్‌కు చిన్న బ్రేక్ ఇవ్వనున్నారట. అయితే ఆయన పూర్తి స్థాయిలో రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని మీరు అనుకుంటే పప్పులో కాలేసినట్టే. ఆయన ఎంతకాలం దూరంగా ఉంటారన్నది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది.

కేటీఆర్ పై సంచలన ఆరోపణలు..

ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి కూడా బండి సంజయ్ కరీంనగర్‌లో మహాశక్తి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అమ్మవారి దీక్ష తీసుకున్నారు. ఈ దీక్ష తీసుకునే ముందు ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బసరత్ ఖాన్ స్మగ్లింగ్ చేసిన ల్యాండ్ క్రూజర్ వాహనాలను కేటీఆర్ వాడుతున్నాడని సెన్సేషనల్ అలిగేషన్స్ చేసిన బండి ఆ తర్వాత నో కామెంట్ అంటూ సైలెంట్ అయిపోయారు. పొలిటికల్ బ్రేక్‌కు ముందు ఆయన ఇచ్చిన లాస్ట్ పొలిటికల్ స్టేట్ మెంట్ ఇదే. దీని తర్వాత ఆయన నవరాత్రి ముగిసే వరకు రాజకీయాలకు దూరంగా ఉండనున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడు కూడా శరన్నవరాత్రులు జరిగే తొమ్మిది రోజుల పాటు ఆయన ఎలాంటి రాజకీయాలు మాట్లాడరని సన్నిహితులు చెబుతున్నారు. అయితే అమ్మవారి దీక్ష తీసుకునే ముందు రాజకీయ ఆరోపణలు చేసిన బండి సంజయ్..ఇక నైన్ డేస్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటారట. ఆయనపై ఎవరైన ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శలు చేసినా స్పందించరట. పూర్తిగా ఈ 9 రోజులు ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ అమ్మవారికి సేవ చేస్తూ దాండియా, బతుకమ్మ కార్యక్రమాల్లో పాల్గొంటారట. అంతే కాకుండా పార్టీ తరఫున కానీ కేంద్ర ప్రభుత్వం తరఫున కానీ ఎంత పెద్ద కార్యక్రమం జరిగినా ఆయన ఆ దేవాలయాన్ని విడిచి 9రోజులు బయటకు రాకుండా అక్కడే ఉంటారట. నిత్యం ఏదో ఒక సంచలన కామెంట్ చేస్తూ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా ఉండే సంజయ్ తొమ్మిదిరోజుల పాటు రాజకీయాలకు దూరంగా ఉండటం కాస్త ఇంట్రెస్టింగ్ విషయమే. అమ్మవారి భక్తుడైన బండి సంజయ్ ప్రతీ ఏడాది తొమ్మిదిరోజులు మాలలో ఉంటారు. కరీంనగర్‌కే పరిమితం అవుతారు. ఆ టైమ్‌లో నో పాలిటిక్స్ నో కామెంట్స్ అంటూ సాధ్యమైనంత వరకు మీడియా కంటపడకుండా..అమ్మవారి సన్నిధిలో పూర్తిగా దైవారాధనలో ఉంటారు. స్పైసీ అండ్ కాంట్రవర్సీ కామెంట్స్‌కు కేరాఫ్‌గా ఉండే సంజయ్ అమ్మవారి దీక్షతో పాలిటిక్స్ నుంచి షార్ట్ బ్రేక్ తీసుకోవడం అయితే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేస్తోంది. దీక్ష అయిపోయిన తర్వాత బండి ఏ అంశంతో మళ్లీ మీడియాలో హాట్ టాపిక్ నిలుస్తా

# లోకేష్ ఆహ్వానం...జగన్ ఓకేనా ?

అదేంటో ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్క ప్రోగ్రాం లో కూడా అధికార పక్షం విపక్ష వైసీపీ కలిసిన దాఖలాలు లేవు. జూన్ 21న ప్రమాణ స్వీకారానికి మాత్రం అందరితో కలసి జగన్ అటెండ్ అయ్యారు. అపుడే సభలో చంద్రబాబు పవన్ లోకేష్ జగన్ లను ఒక్కసారి అంతా చూశారు. ఆ తరువాత బడ్జెట్ సెషన్ కి ముందు గవర్నర్ చేసే ప్రసంగానికి రెండు సార్లు జగన్ హాజరయ్యారు. అంతే అంతకు మించి జగన్ సభకు రావడం లేదు. ఇక చూస్తే శాసన సభ సమావేశాలు గత పదిహేను నెలలలో అనేక సార్లు జరిగాయి. కానీ సభలో వైసీపీ లేదు. అయితే వైసీపీ మీద మాత్రం కూటమి నుంచి విమర్శలు అయితే సభ లోపలా బయటా సాగుతూనే ఉన్నాయి.

రావాలి జగన్ :

ఇక పోతే ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒకేసారి మెగా డీఎస్సీ పేరుతో 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. వారికి సంబంధించిన నియామక పత్రాలను ఈ నెల 26న విజయవాడ వేదికగా భారీ కార్యక్రమం నిర్వహించి ఎంతో ప్రతిష్టాత్మకంగా అందచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇక ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరవుతున్నారు అంతే కాదు విద్యా శాఖ మంత్రి హెూదాలో నారా లోకేష్ పాల్గొంటున్నారు. అయితే ఈ మెగా వేడుకకు జగన్ ని కూడా ఆహ్వానించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించడం విశేషం.

పులివెందుల ఎమ్మెల్యేగా :

ఇంతటి పెద్ద కార్యక్రమం ఒక పండుగలా నిర్వహించే కార్యక్రమానికి పులివెందుల ఎమ్మెల్యే జగన్ ని కూడా ఆహ్వానిస్తున్నామని నారా లోకేష్ మీడియాకు చెప్పారు. జగన్ కూడా రావాలని ఆయన అంటున్నారు. జగన్ వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. అయితే జగన్ ని పులివెందుల ఎమ్మెల్యేగానే ఆహ్వానిస్తున్నామని లోకేష్ చెప్పడం విశేషం.



జగన్ వస్తారా :

గతంలో అంటే 2014 నుంచి 2019 దాకా సాగిన టీడీపీ ప్రభుత్వ కాలంలో కూడా అధికారిక కార్యక్రమాలకు జగన్ ఎక్కడా హాజరు కాలేదని అంటున్నారు. అమరావతి రాజధాని శంకుస్థాపనకు ఆయన రాలేదు, ఇక 2024లో కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణం పున ప్రారంభం కార్యక్రమానికి సైతం జగన్ ని పిలుస్తామని అన్నారు. మరి ఆయన అయితే రాలేదని అంటున్నారు. ఇపుడు మెగా డీఎస్సీ వేడుకకు జగన్ వస్తారా అన్నదే చర్చ. అయితే జగన్ రావాలని అనడం వెనక కూడా కూటమి రాజకీయ వ్యూహం ఉందని అంటున్నారు. మా హయాంలో డీఎస్సీ మెగా స్కేల్ మీద నిర్వహించామని ఇప్పటికే చెప్పుకుంటోంది. దాంతో జగన్ వస్తే కళ్లారా అంతా చూస్తారనే ఈ పిలుపు అంటున్నారు. మరి జగన్ అయితే వచ్చేది ఉండదని అంటున్నారు. ఆయన రాక పోతే విశేషం లేదు కానీ వస్తేనే అది జాతీయ సంచలనం అవుతుందని కూడా అంటున్నారు. సో అదన్న మాట మ్యాటర్.

# బొత్స బిగ్ డెసిషన్.. మంత్రి లోకేశ ప్రతిపాదనకు ఓకే చెప్పిన సీనియర్ నేత

అమరావతి,రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాసనమండలిలో మంగళవారం చోటుచేసుకున్న ఓ సంఘటన రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలో ఏ ఇద్దరు నేతలు కలుసుకున్నా ఇప్పుడు ఇదే అంశం చర్చించుకుంటున్నారు. ప్రధానంగా మంత్రి లోకేశ్ చేసిన ప్రతిపాదనకు వైసీపీ నేత బొత్స ఓకే చెప్పడం పెను సంచలనంగా చెబుతున్నారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఎన్నడూ లేనట్లు టీడీపీ ప్రభుత్వానికి సానుకూలమైన నిర్ణయాన్ని తీసుకుని సహకరించలేదని, కానీ తొలిసారిగా ప్రభుత్వ తీర్మానాన్ని ఆమోదిస్తూ వైసీపీ ప్రకటన చేయడం పెద్ద రికార్డే అంటున్నారు. ప్రస్తుతం శాసనసభతోపాటు శాసనమండలి వర్షాకాల సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రతిపక్ష హెూదా లేదన్న కారణంగా అసెంబ్లీకి వైసీపీ సభ్యుల గైర్హాజరు అవుతున్నారు. దీంతో అసెంబ్లీలో ఏ బిల్లు ప్రవేశపెట్టినా ఏకపక్షంగా ఆమోదం లభిస్తోంది. అదే సమయంలో అసెంబ్లీ కార్యకలాపాలు కూడా ఏకపక్షంగా సాగుతున్నాయి. కానీ, మండలిలో ప్రభుత్వ కూటమి కన్నా ప్రతిపక్షానికే ఎక్కువ బలం ఉంది. దీంతో మండలి సమావేశాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వాడివేడిగా సాగుతున్న మండలి సమావేశాలను టీవీలు, సోషల్ మీడియా ద్వారా ఎక్కువ మంది వీక్షిస్తున్నారు. ఇలాంటి సమయంలో మంగళవారం మండలి వేదికగా జరిగిన ఓ సంఘటన అందరినీ ఆకర్షించింది. ముఖ్యంగా మండలిలో ప్రతిపక్ష నేత బొత్స తీసుకున్న నిర్ణయం అందరినీ షాక్ కి గురిచేసింది. ఈ సమావేశాలలో ప్రభుత్వం పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా, కొన్నింటిని వ్యతిరేకించడం, మరికొన్నింటిని వాకౌట్ ద్వారా బహిష్కరిస్తున్నట్లు వైసీపీ సభ్యులు ప్రకటించేవారు. తాజాగా జీఎస్టీపై తీర్మానం చేసిన సమయంలో కూడా వ్యతిరేకించలేదు కానీ, వాకౌట్ చేసి తీర్మానంపై తమ నిర్ణయం ఏంటీ వెల్లడించకుండా తప్పించుకున్నారు. కానీ, విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర



ప్రభుత్వాన్ని అభినందిస్తూ మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా వైసీపీ తప్పించుకోలేకపోయింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై మండలిలో వాడివేడి జరిగింది. అయితే వైసీపీ సభ్యుల విమర్శలకు గట్టిగా బదులిచ్చిన మంత్రి లోకేశ్ వంద సార్లు చెబుతున్నా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాదు అని తేల్చిచెప్పారు. అంతేకాకుండా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విజయవంతంగా అడ్డుకున్నందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు మంత్రి హెచ్.డీ.కుమారస్వామికి అభినందనలు తెలుపుతూ మంత్రి లోకేశ్ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని సభ్యులు అంతా ఆమోదించాలని కోరారు. అప్పటివరకు స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన వైసీపీ సభ్యులు కూడా తీర్మానానికి మద్దతు తెలపడంతో ఆశ్చర్యం వ్యక్తమైంది. ఈ సమయంలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న మండలి చైర్మన్ మోషేన్ రాజు తీర్మానానికి మద్దతు ఇస్తున్నారా? అంటూ బొత్సను ప్రశ్నించగా, ఆయన అవును అని చెప్పడం విశేషం.

# వైసీపీ 2.0 లో పాలించేది వారేనా ?



అమరావతి,వైసీపీ పాలన ఏమిటి అన్నది ఒకసారి చూశారు. అయిదేళ్ళ పాటు జగన్ అధికారంలో ఉన్నారు. వైసీపీ ప్రాధాన్యతలు ఏమిటి అన్నది కూడా అటు సగటు ప్రజలకు ఇటు పార్టీ క్యాడర్ కి కూడా పూర్తిగా అర్థం అయింది. వైసీపీ ఫోకస్ ఎక్కువగా సంక్షేమం మీదనే పెట్టింది అలాగే వైసీపీ క్యాడర్ కంటే కూడా వాలంటీర్ల వ్యవస్థను నమ్ముకుంది. వారే మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తారని భావించింది. అయితే వైసీపీ ఆశలు నమ్మకాలూ 2024 ఎన్నికల్లో పూర్తిగా వమ్ము అయిపోయాయి. ఎన్నడూ లేని విధంగా వైసీపీ దారుణంగా ఓటమి పాలు అయింది. దాంతో వైసీపీలో అంతర్మధనం మొదలైంది. ఇపుడు పార్టీ నెమ్మదిగా రిపేర్లు మొదలెట్టింది.

అంతా మీవల్లే అంటూ :

వైసీపీ 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా అయిదేళ్ళ పాలన తరువాత యాంటీ ఇంకెంబెన్సీ ఉన్నా కూడా 40 శాతం ఓట్ షేర్ ని సాధించింది. ఈ ఘనత అంతా క్యాడర్ దే అని జగన్ వారికి ఇచ్చేశారు. వైసీపీ క్యాడర్ అంతా ఒక ఫ్యామిలీ అని కితాబు ఇచ్చారు. మీరు లేకపోతే వైసీపీ లేదని అన్నారు. గత 14 ఏళ్ళుగా వైసీపీ ఈ విధంగా పటిష్టంగా ఉంది అంటే క్యాడర్ వల్లనే అని జగన్ స్పష్టం చేశారు.

ఐడీ కార్డులు ఇస్తామని :

ఇక వైసీపీ క్యాడర్ కి ప్రస్తుతం పదవుల్లో అవకాశం ఇస్తామని ప్రభుత్వం వచ్చినపుడు అన్ని విధాలుగా వారినే ముందు పెట్టి నడిపిస్తామని జగన్ హామీ ఇచ్చారు. వైసీపీ పార్టీ యంత్రాంగాన్ని గ్రామ స్థాయి వరకూ తీసుకుని పోవాలని ఆయన కోరారు. అంతే కాదు గ్రామ స్థాయిలో కూడా మహిళ, యువత, విద్యార్థి, రైతు ఇలా అన్ని అనుబంధ విభాగాలు ఉండాలని ఆయన కోరారు. పార్టీలో కీలక క్యాడర్ కి బాధ్యులకు ఐడీ కార్డులు కూడా ఇస్తామని జగన్ చెప్పారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రాస్ రూట్ లెవెల్ వరకూ కూడా పార్టీ నిర్మాణం పకడ్బంధీగా ఉండాలని ఆయన సూచించారు. డిసెంబర్ నెలాఖరులోగా కమిటీల నిర్మాణం అంతా గ్రాస్ రూట్ లెవెల్ దాకా పూర్తి చేయాలని అలా చేయని అసెంబ్లీ ఇంచార్జిలను పదవుల నుంచి తప్పిస్తామని జగన్ హెచ్చరించినట్లుగా చెబుతున్నారు.

మీరే పాలకులు :

వైసీపీ అధికారంలోకి వస్తే మీరే పాలకులు అని జగన్ క్యాడర్ కి చెప్పారు. మీరు ఎలా చెబితే అలాగే పాలన ఉంటుందని ప్రభుత్వాన్ని గ్రామ స్థాయి నుంచే నడుపుదామని ఆయన చెప్పడం విశేషం. అభివృద్ధి కార్యక్రమాలు అయినా లేక సంక్షేమ కార్యక్రమాలు అయినా క్యాడర్ ని ముందు పెట్టే జరిపిస్తామని జగన్ మరో హామీ ఇచ్చారు. మొత్తానికి క్యాడర్ కే అగ్ర తాంబూలం అని జగన్ స్పష్టం చేసినట్లు అయింది అని అంటున్నారు. అదే అధికారంలో ఉన్నపుడే ఈ విధంగా వ్యవహరించి ఉంటే కనుక పార్టీ ఇంత దారుణంగా ఓటమి పాలు అయ్యేది ఉండదు కదా అని అంటున్నారు. మొత్తం మీద వైసీపీ సరైన దారిలోనే వెళ్తోంది అని పార్టీ వాదులు అంటున్నారు. బాటం టూ టాప్ అన్నది పార్టీ ఆలోచనగా చెబుతున్నారు. నిర్ణయాలు సలహాలు అట్టడుగు స్థాయి నుంచి రావాలని పార్టీ బలంగా కోరుకుంటోంది అని అంటున్నారు.

# తగ్గేదేలే.. వదిలేదే లే.. ప్రతీకారంతో జగన్ మరో సంచలనం



అమరావతి, ఏపీలో విచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని టీడీపీ కూటమి టార్గెట్ చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు హాజరుకు సంబంధించి ఆసక్తికర అంశాలు తెరపైకి వచ్చాయి. కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరుకాకుండానే రిజిస్టర్లో సంతకాలు పెడుతున్న విషయం చర్చకు వచ్చింది. అటువంటి వారిపై వచ్చే సమావేశాల నాటికి అనర్హతా వేటు వేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ రోజు తాడేపల్లిలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో జగన్ సమావేశం నిర్వహించారు. టీడీపీ రెడ్ బుక్ మాదిరిగానే డిజిటల్ బుక్ ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు.

అప్పట్లో లోకేష్ రెడ్ బుక్..

టీడీపీ విపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలను వెంటాడింది వైసీపీ ప్రభుత్వం. చివరకు కుప్పంలో చంద్రబాబును సైతం విడిచిపెట్టలేదు. యువగళం ప్రారంభించిన లోకేష్ కు అడుగడుగునా చుక్కలు చూపించారు. అయినా వెనక్కి తగ్గని లోకేష్ ఒక రెడ్ బుక్ తో కనిపించేవారు. ఈ క్రమంలో యువగళం ముగింపు సభలో రెడ్ బుక్ పై ఫుల్ క్లారిటీ ఇచ్చారు. వైసీపీ హయాలో టీడీపీ శ్రేణులను ఇబ్బందిపెట్టిన ప్రతిఒక్కరి పేర్లు రాసుకుంటున్నానని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్ బుక్ కు ఎనలేని ప్రాధాన్యం దక్కింది. ఎందుకంటే వైసీపీ నేతల వరుస అరెస్టులుతో రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని వైసీపీ ఆరోపించడం ప్రారంభించింది.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

అయితే రెడ్ బుక్ మాదిరిగా మనం కూడా ఒక బుక్ రాసుకొందామని వైసీపీ నేతలు కోరడంతో డిజిటల్ బుక్ ప్రారంభించారు జగన్. ఈ రోజు తాడేపల్లిలో పార్టీ నాయకుల సమావేశంలో డిజిటల్ బుక్ ను ఆవిష్కరించారు జగన్. ప్రతిఒక్కరి వివరాలు డిజిటల్ బుక్ లో రాయాలని.. ఆధారాలుంటే నమోదు చేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సప్త సముద్రాల అవతల ఉన్నా తెచ్చి శిక్షిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తగ్గేదేలే..వదిలేదిలే అంటూ తేల్చిచెప్పారు. వైసీపీ కార్యకర్తల జోలికి వచ్చిన వారిని విడిచిపెట్టమని హెచ్చరించారు. జగన్ హెచ్చరికలను వైసీపీ సోషల్ మీడియా విభాగం వైరల్ చేస్తోంది.

# అమెరికాతో యుద్ధానికి సై అంటున్న తాలిబన్లు..

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆఫ్ఘనిస్థాన్‌లోని బాగ్రామ్ వైమానిక స్థావరం గురించి ఇటీవల చేసిన ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తుంది. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ట్రంప్ తన ప్రకటనలో తాలిబన్లు బాగ్రామ్‌ను అప్పగించకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని స్పష్టంగా హెచ్చరించారు. ఈ ప్రకటన వెలువడిన అనంతరం ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ కార్యకలాపాలు వేగవంతం అయ్యాయి. బాగ్రామ్ విషయంలో ఒక వేళ అమెరికాతో యుద్ధానికి తాలిబన్లు యుద్ధానికి సిద్ధం అయితే పరిస్థితి ఎలా ఉంటుంది, ఇంతకీ తాలిబన్లకు ఉన్న బలం ఎంత? అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం..

ట్రంప్ ప్రకటన తర్వాత జోరందుకున్న సమావేశాలు

కాందహార్‌లో తాలిబన్ అధినేత హెబ్తుల్లా అఖుండ్‌జాదా నిత్యం అగ్ర మంత్రులు, నిఘా అధిపతులు, సైనిక కమాండర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలలో కీలక అంశంగా బాగ్రామ్ వైమానిక స్థావరం ఉందని పలు నిఘా వర్గాలు చెబుతున్నాయి. పలు నివేదికల ప్రకారం.. ట్రంప్ కన్నెర్ర చేసిన తర్వాత కాందహార్‌లోని అఖుండ్‌జాదా నివాసం చుట్టూ పెద్ద సంఖ్యలో కమాండోలను మోహరించారు. ఈ సమావేశాల్లో తాలిబన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ బాగ్రామ్‌ను అగ్రరాజ్యానికి ఇవ్వడానికి ఒప్పుకోనట్లు సమాచారం.. ఒక వేళ అమెరికా బాగ్రామ్‌ను ఆక్రమించుకోడానికి ప్రయత్నిస్తే ప్రత్యక్ష పోరాటంలో పాల్గొనడానికి సిద్ధం కావడానికి నిర్ణయించినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గబోమని తాలిబన్లు స్పష్టం చేశారు. గతంలో కంటే ఇప్పుడు కాందహార్‌లో భద్రత కట్టుదిట్టం చేశారు.

ఇంతకీ తాలిబన్ల సైనిక బలం ఎంత?

ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ వార్షిక నివేదిక ప్రకారం.. తాలిబాన్ల వద్ద ప్రస్తుతం దాదాపు 150,000 మంది క్రియాశీల యోధులను ఉన్నారు. తాజాగా ఈ సంఖ్యను మరో 50 వేలు పెంచుతామని తాలిబాన్ సైనిక అధిపతి పేర్కొన్నారు. అయితే ఈ విస్తరణకు ఎంత కాలం పడుతుందో ఆయన పేర్కొలేదు. దళాల సంఖ్య పరంగా.. US వద్ద 2.1 మిలియన్లకు పైగా సైనికులు, 13,398 సైనిక విమానాలు ఉన్నాయి. అలాగే USకు 6,287 ట్యాంకులు, 24 విమాన వాహక నౌకలు ఉన్నాయి. 2021లో ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా, అంతర్జాతీయ దళాల ఉపసంహరణ తర్వాత, తాలిబన్లు పెద్ద మొత్తంలో ఆయుధాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాలిబన్లు వద్ద ప్రస్తుతం మూడు తేలికపాటి విమానాలు, అమెరికన్ బ్లాక్ హాక్స్‌తో సహా 14 హెలికాప్టర్లు ఉన్నాయి. ఆఫ్ఘన్ నేషనల్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఫోర్సెస్ నుంచి కొన్ని



రష్యన్ హెలికాప్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అమెరికా దళాలు ఆఫ్ఘనిస్థాన్‌ను విడిచిపెట్టినప్పుడు దాదాపు $7 బిలియన్ల విలువైన సైనిక పరికరాలను వదిలి వెళ్లినట్లు అంచనా. ఇందులో హైటెక్ ఆయుధాలు, అధునాతన వ్యవస్థలు కూడా ఉన్నాయి. అయితే ఈ పరికరాలను ఆపరేట్ చేయగల నైపుణ్యం ఉన్న సైనిక శక్తి తాలిబన్ల వద్ద పరిమితం అని రక్షణ నిపుణులు భావిస్తున్నారు.

ఉద్రిక్తతలకు దారి తీసిన ట్రంప్ ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటన తాలిబన్లకు ఆగ్రం తెప్పించింది. బాగ్రామ్ వైమానిక స్థావరాన్ని అమెరికా తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటుందని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. బాగ్రామ్ ఒకప్పుడు అమెరికన్ శక్తికి చిహ్నంగా ఉండేది. కానీ తాలిబన్లకు ఈ వైమానిక స్థావరం కేవలం సైనిక స్థావరం మాత్రమే కాదు, ప్రతీకాత్మక విజయం. కాబట్టి వాళ్లు దానిని తిరిగి అమెరికాకు అప్పగించడం అంటే లొంగిపోవడం అని, అది ఓటమి మాత్రమే కాదని, తాలిబన్ ప్రభుత్వ విశ్వసనీయతను కూడా కోల్పోతుందని భావిస్తున్నారు. తాలిబన్ల వద్ద సైన్యం, ఆయుధాలు ఉన్నప్పటికి వారికి సరైన శిక్షణ లేకపోవడం ప్రధానమైన మైనస్. పొరపాటున యుద్ధం జరుగుతునే ఈ అంశం అమెరికాకు అదనపు బలంగా మారనుంది.

## బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కొండా సురేఖ

వరంగల్,వరంగల్ మహానగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కొండా సురేఖ పాల్గొని తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మ ఎత్తుకున్నారు. బతుకమ్మ ఆటపాటలతో బల్దియా ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూ.234 కోట్ల విలువైన పీడీఎస్ బియ్యం స్వాధీనం

అమరావతి: పౌరసరఫరాల వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను నిరోధించడంపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్సీల ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 234 కోట్ల విలువైన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు- తెలిపారు. కాకినాడ పోర్టులో 3, విశాఖలో 3, నెల్లూరులో ఒక చెక్‌పోస్టు ఏర్పాటు- చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. 5.65 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఏడాదిలోనే స్వాధీనం చేసుకున్నట్లు- వివరించారు. -క్రై-కలూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రూ. 5.45 కోట్ల విలువైన బియ్యాన్ని పక్కదారి పట్టించారన్నారు. రెండు రోజుల్లో ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com